




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 245 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు ఆదివారం 10 మే 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :245 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SUN10 MAY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## హైదరాబాద్ ట్రాఫిక్‌లో చిక్కుకున్న చంద్రబాబు కాన్వాయ్

- ప్రధాని మోదీ పర్యటన ట్రయల్ రన్‌తో ఇబ్బందులు
- బంజారాహిల్స్‌లో 10 నిమిషాలు ఆగిన కాన్వాయ్
- ట్రాఫిక్ కారణంగా కారు నుంచి కిందకు దిగిన ముఖ్యమంత్రి
- సమాచార లోపమే కారణమని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన కాన్వాయ్‌తో హైదరాబాద్ ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసులు నిర్వహిస్తున్న ట్రయల్ రన్ కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది. నగరంలోని బంజారాహిల్స్ ప్రాంతంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లలో భాగంగా పోలీసులు బంజారాహిల్స్ మార్గంలో కాన్వాయ్ ట్రయల్ రన్ చేపట్టారు. అయితే, కమ్యూనికేషన్ గ్యాప్ కారణంగా అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్వాయ్ అటువైపుగా వచ్చింది. దీంతో ఆయన

- మిగతా 2లో



## విశాఖలో 102 కి.మీ. మేర సెమీ రింగురోడ్డు

పెన్ పవర్ డెస్క్: రానున్న 50 ఏళ్లలో విశాఖ నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సెమీ రింగురోడ్డు నిర్మిస్తున్నామని ఏపీ మంత్రి నారాయణ అన్నారు. రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కి.మీ మేర రింగు రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పారు. వీఎంఆర్డీఏ మాస్టర్‌ప్లాన్‌పై మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి అధికారులతో నారాయణ సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. "నగరం అభివృద్ధి చెందాలంటే మాస్టర్ ప్లాన్ అవసరం. దీనిపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించాం. మాస్టర్‌ప్లాన్ అంశంలో వచ్చిన వినతులపై ఈ సమావేశంలో చర్చించాం. ఎమ్మెల్యేల నుంచి

- మిగతా 2లో

# ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి లోకేశ్

- ఏపీ ప్రభుత్వ సలహాదారు వేమూరు రవికుమార్ తనయుడి వివాహ వేడుకకు హాజరైన మంత్రి నారా లోకేష్
- విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి లోకేష్
- మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ అధికారులు
- ఏపీ ప్రభుత్వ సలహాదారు వేమూరు రవికుమార్ కుమారుడి వివాహానికి హాజరు
- నూతన వధూవరులు కిరణ్, పుష్పలతలను ఆశీర్వదించిన మంత్రి
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచన



పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శనివారం విజయవాడలో పర్యటించారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏపీ ప్రభుత్వ సలహాదారు, ఏపీఎన్ఆర్టీ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ వేమూరు రవికుమార్ కుమారుడి వివాహ వేడుకలో పాల్గొన్నారు.

శనివారం ఉదయం ఇంద్రకీలాద్రికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు దేవస్థానం అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆలయ కమిషనర్ రామచంద్ర మోహన్, ఈవో సీనా నాయక్, బోర్డు ఛైర్మన్ బోరా రాధాకృష్ణ తదితరులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేదపండితులు లోకేష్‌కు వేదాశీర్వచనం అందించారు. అధికారులు అమ్మవారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు.ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలోనే జరిగిన వేమూరు రవి కుమార్ కుమారుడు కిరణ్, పుష్పలతల వివాహ వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. తన పర్యటనపై మంత్రి లోకేష్ స్పందిస్తూ, అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులతో మాట్లాడిన మంత్రి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## పవన్ కల్యాణ్ సీఎం స్థాయి నేత.. కానీ బీజేపీతో చేరింది అందుకే!

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తనకు సానుకూల దృక్పథం ఉందన్న ఉండవల్లి
- బీజేపీతో పవన్ చేరడం రాజకీయ అవసరమేనని వ్యాఖ్య
- జగన్‌ను గద్దె దించాలనే ఉద్దేశంతోనే పవన్ కూటమికి మద్దతిచ్చారని విశ్లేషణ
- పవన్‌కు సనాతన ధర్మం కంటే కమ్యూనిస్ట్ సిద్ధాంతాలే ఎక్కువ తెలుసన్న ఉండవల్లి
- పవన్ కల్యాణ్ ఒక ముఖ్యమంత్రి స్థాయి నాయకుడని కితాబు

- మిగతా 2లో




## శ్రీశైలంలో యాత్రికులకు సైబర్ నేరగాళ్ల టోకరా

పెన్ పవర్ డెస్క్: శ్రీశైలంలో సైబర్ మోసం వెలుగు చూసింది. దిల్లీకి చెందిన ఆనంద్‌కుమార్ శ్రీశైలం మల్లికార్జున సదన్‌లో 9 ఏసీ గదులను ఓ వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకున్నారు. ఇందుకోసం పేటీఎం ద్వారా రూ.15 వేలు చెల్లించారు. శనివారం 27 మంది దిల్లీవాసులు హైదరాబాద్ నుంచి ఓ టూరిస్ట్ బస్సులో శ్రీశైలం వచ్చారు. మల్లికార్జున సదన్‌లో గదుల కోసం సంప్రదించగా అక్కడ గదుల బుకింగ్ జరగలేదని తెలిసింది. దీంతో మోసపోయినట్లు బాధితులు గుర్తించారు. ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల యాత్రికులను లక్ష్యంగా చేసుకొని నకిలీ వెబ్‌సైట్లతో సైబర్ నేరగాళ్లు ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

సైబర్ మోసంపై స్పందించిన దేవస్థానం ఈవో దిల్లీ యాత్రికులకు జరిగిన సైబర్

- మిగతా 2లో





## పవన్ తో సినిమా తీయాలనేది నా కోరిక

- పవన్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఆయనతో భారీ చిత్రాన్ని నిర్మిస్తానన్న బాలినేని
- తప్పిదాలను ప్రశ్నించినందుకు వైసీపీలో ఇబ్బందులు ఎదుర్కొన్నానని వెల్లడి
- తనకు పదవుల మీద ఆశ లేదని పవన్‌కు చెప్పానన్న బాలినేని

పెన్ పవర్ డెస్క్:జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ఒక సినిమా నిర్మించాలనేది తన చిరకాల కోరిక అని మాజీ మంత్రి

- మిగతా 2లో

## ఒక్క రోజులోనే డీఎంకేతో బంధాన్ని తెంచుకుని కాంగ్రెస్ వెళ్లిపోయింది: స్టాలిన్ ఆవేదన

- టీవీకేకు మద్దతిచ్చిన కాంగ్రెస్‌పై స్టాలిన్ అసహనం
- ఒక్క రోజులోనే బంధం తెంచుకుందని వ్యాఖ్య
- వెంట నిలిచిన మిత్రపక్షాలకు ప్రత్యేక కృతజ్ఞతలు
- కొత్త ప్రభుత్వం పాత పథకాలు కొనసాగించాలని విజ్ఞప్తి

- మిగతా 2లో



## తమిళనాడు సీఎంగా విజయ్... నేడు ప్రమాణ స్వీకారం

- తమిళనాడు రాజకీయాల్లో నాటకీయ పరిణామాలు
- టీవీకే పార్టీకి మద్దతు ప్రకటించిన వీసీకే, ఐయూఎంఎల్
- 120 సీట్ల బలంతో గవర్నర్ ను కలిసిన విజయ్
- విజయ్ తో భేటీ కోసం కేరళ పర్యటన రద్దు చేసుకున్న గవర్నర్
- నేడు చెన్నై నెహ్రూ స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రమాణ స్వీకారం



పెన్ పవర్ డెస్క్:తమిళ రాజకీయాల్లో కొద్దిరోజు లుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ అధినేత విజయ్, తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు మార్గం సుగమమైంది. (ఆదివారం) మధ్యాహ్నం 3 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నారు. ఈరోజు చోటుచేసుకున్న నాటకీయ పరిణామాల మధ్య, విజయ్ చెన్నైలోని లోక్‌భవన్‌లో ఇన్‌చార్జ్ గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌తో సమావేశమయ్యారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 120 మంది సభ్యుల

- మిగతా 2లో



## పెరగనున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధర?

- అంతర్జాతీయ మార్కెట్‌లో భారీగా పెరిగిన ముడిచమురు ధర
- బ్యారెల్ ధర 70 డాలర్ల నుంచి 126 డాలర్లకు చేరిన వైనం
- మే 15 లోపు ఇంధన ధరలు పెరిగే అవకాశం

పెన్ పవర్ డెస్క్:మన దేశంలో వాహన దారులపై పెట్రో ల్, డీజిల్ ధరల భారం

- మిగతా 2లో




## రిజిస్టర్డ్ అగ్రిమెంట్ లేకున్నా హక్కులుంటాయ్

### హోమ్‌బయర్లకు అండగా తెలంగాణ రేరా కీలక తీర్పు

- హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో కీలక తీర్పు
- నమోదు కాని ఒప్పందాలకూ రేరా రక్షణ
- ఆలస్యమైన ప్రాజెక్టులపై రేరా కొరడా
- 30 రోజుల్లో షెడ్యూల్ ఇవ్వాల్సిందేనని ఆదేశం

పెన్ పవర్ డెస్క్:హైదరాబాద్‌లో ఆలస్యమవుతున్న ఓ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ రేరా (TSRERA) సంచలన తీర్పు వెలువరించింది. రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్ లేనంత మాత్రాన హోమ్‌బయర్లు తమ హక్కులను కోల్పోరని స్పష్టం చేసింది. గణనీయంగా డబ్బు చెల్లించి, ఫ్లాట్లను కేటాయించుకున్న

- మిగతా 2లో



## థాయ్‌లాండ్ గబ్బిలాల్లో కొత్త కరోనావైరస్..

### మానవులకు సోకే ప్రమాదం!

- థాయ్‌లాండ్ గబ్బిలాల్లో కొత్త కరోనావైరస్‌ను గుర్తించిన శాస్త్రవేత్తలు
- ఈ వైరస్ మానవులకు సోకే ప్రమాదం ఉందని పరిశోధనలో వెల్లడి
- ఈ వైరస్ కోవిడ్-19కు చెందిన సార్బెకోవైరస్ కుటుంబానికి చెందినది
- కోవిడ్-19 లాగే మానవ కణాల్లోకి ప్రవేశించే సామర్థ్యం దీనికి ఉంది
- ప్రస్తుతానికి మానవుల్లో ఎలాంటి కేసులు లేవని, ఆందోళన వద్దని సూచన

పెన్ పవర్ డెస్క్:థాయ్‌లాండ్ శాస్త్రవేత్తలు గబ్బిలాల్లో ఓ కొత్త రకం కరోనావైరస్‌ను గుర్తించారు. ఇది భవిష్యత్తులో మానవులకు సోకే ప్రమాదం ఉందని వారి పరిశోధనలో తేలింది. యూనివర్సిటీ ఆఫ్ టోక్యోతో సహా పలు అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో

- మిగతా 2లో




# డీఎంకే విషయం కాంగ్రెస్ తప్పు చేసిందా?

రాజకీయాల్లో మార్పు అనివార్యం. అంతేనా.. రాజకీయాల్లో శాశ్విత శత్రువులు.. శాశ్విత స్నేహితులు ఎవరూ ఉండరు. ఎవరికి వారు తమ రాజకీయ అవసరాలకు తగినట్లే వ్యవహరిస్తుంటారు. అదేమీ తప్పు కాదు. అందుకు ఏ రాజకీయ పార్టీ కూడా మినహాయింపు కాదు. దశాబ్దాల తరబడి డీఎంకేతో ఉన్న మిత్రత్వాన్ని పక్కన పెట్టేసి.. అధికారానికి దగ్గరగా ఉన్న విజయ్ కు మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ తీరుపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ తన బుద్ధిని చూపించిందని.. సరైన సమయాన్ని చూసి తన దారి తాను చూసుకుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక.. దశాబ్దాల తరబడి సాగుతున్న స్నేహాన్ని పక్కన పెట్టేసి.. విజయ్ తో కలవటాన్ని డీఎంకే జీర్ణించుకోలేకపోతోంది. తమతో స్నేహహస్తాన్ని వదిలేసిన హస్తం పార్టీపై పార్టీ చీఫ్ స్టాలిన్ సైతం సీరియస్ కావటం తెలిసిందే. కాంగ్రెస్ తో కలిసి చట్టసభలో పక్కపక్కనే కూర్చోవటానికి కూడా తమకు నచ్చలేదని.. తమకు వేరే వరుసలో కూర్చునేలా అనుమతి ఇవ్వాలని లోక్ సభ స్పీకర్ కు డీఎంకే నేత లేఖ రాయటం చూస్తే.. కాంగ్రెస్ తాజా నిర్ణయం డీఎంకును ఎంతటి ఆగ్రహానికి గురి చేసిందన్న విషయం అర్థమయ్యేలా చేస్తుందని చెప్పాలి.

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన మేజిక్ ఫిగర్ కు కేవలం పది మంది ఎమ్మెల్యేల దూరంలో ఉన్న విజయ్ కు.. కాంగ్రెస్ తనకున్న ఐదుగురు ఎమ్మెల్యేలను విజయ్ పార్టీకి మద్దతు ఇస్తారని ప్రకటించటం ద్వారా కొత్త స్నేహానికి తెర తీసింది. విజయ్ పార్టీకి వచ్చిన 108 స్థానాల తర్వాత డీఎంకే.. అన్నాడీఎంకేలను మినహాయిస్తే.. మిగిలిన పార్టీలకు దక్కిన సీట్లు ఒకట్రెండు స్థానాలే. వాటితో చూస్తే.. కాంగ్రెస్ చేతిలో ఉన్న ఐదుగురు ఎమ్మెల్యేలు కీలకమనే చెప్పాలి.విజయ్ కు తమ మద్దతును ప్రకటించటం ద్వారా కాంగ్రెస్ తప్పు చేసిందా? అన్నది ప్రశ్న. భవిష్యత్తు అవసరాల్ని పరిగణలోకి తీసుకుంటే కాంగ్రెస్ తెలివైన పని చేసిందనే చెప్పాలి. తాజా నిర్ణయంతో తన చిరకాల మిత్రుడు డీఎంకేకు కాంగ్రెస్ ఎందుకు హ్యాండిచ్చింది? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. తమిళ రాజకీయాల్లో సరికొత్త ఒరవడికి తెర తీశారు విజయ్. అతడి తీరు చూస్తే.. ఇవాళ వచ్చి రేపు.. ఎల్లుండో వెళ్లిపోయేలా లేదు. దీర్ఘకాలం రాజకీయాల్లో కొనసాగే వీలుంది. దీనికి తోడు స్టాలిన్ తర్వాత డీఎంకే భవిష్యత్తు ఏమిటన్న దానిపైనా పలు సందేహాలు ఉన్నాయి.

అన్నాడీఎంకేతో మొదట్నించి దూరంగా ఉంటున్నదే. ఇలాంటి వేళలో కొత్తగా రాజకీయాల్లోకి రావటం.. వచ్చి రావటంతోనే సంచలనానికి తెర తీయటం చూస్తే.. రానున్న రోజుల్లో విజయ్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని చెప్పక తప్పదు. సినీ నటుడిగా ఇంతకాలం వ్యవహరించిన విజయ్.. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోవటానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. పాలనతో తన మార్క్ చూపించి.. గత పార్టీల ప్రభుత్వానికి భిన్నంగా వ్యవహరిస్తే.. విజయ్ రాజకీయ భవిష్యత్తుకు తిరుగు ఉండదు. అదే సమయంలో కాంగ్రెస్ సైతం సరైన సమయంలో సరైన మిత్రుడి సహకారంతో తాను మరింత బలపడేందుకు అవకాశం దక్కుతుందని చెప్పాలి.

# పవన్ కల్యాణ్ సీఎం స్థాయి నేత.. కానీ బీజేపీతో చేరింది అందుకే!

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తనకు సానుకూల దృక్పథం ఉందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. అయితే, ఆయన రాజకీయ ప్రయాణం, సిద్ధాంతాలపై ఆసక్తికర విశ్లేషణ చేశారు. ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఉండవల్లి మాట్లాడుతూ.. పవన్‌ను తాను ఇప్పటివరకు ఒకసారి మాత్రమే కలిశానని, పునర్విభజన అంశంపై మాట్లాడదామనుకున్నా ఆయన ఆసక్తి చూపలేదని తెలిపారు.

**బీజేపీతో పవన్ చేరడం రాజకీయ అవసరమే**

పవన్ కల్యాణ్ రాజకీయ వైఖరిని ఉండవల్లి విశ్లేషించారు. "చిన్నప్పుడు నక్సలైట్లలో చేరదామనుకున్నా" అని పవన్ చెప్పిన మాటలను గుర్తుచేస్తూ, 2019 ఎన్నికల్లో ఆయన కమ్యూనిస్టులతో కలిసి పోటీ చేశారని ప్రస్తావించారు. ఆ తర్వాత బీజేపీతో చేరడం కేవలం రాజకీయ అవసరాల కోసమేనని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ఎదురైన అవమానాలను భరించలేకే పవన్ ఈ నిర్ణయం తీసుకుని ఉండొచ్చన్నారు. జగన్‌ను ఎలాగైనా గద్దె దించాలనే బలమైన ఆకాంక్షతోనే, చంద్రబాబు రాజమండ్రి జైల్లో ఉన్నప్పుడు వెళ్లి మద్దతు ప్రకటించారని, ఇది తనను తాను కాపాడుకోవడానికేనని తాను భావిస్తున్నట్లు ఉండవల్లి పేర్కొన్నారు.

**పవన్‌కు సనాతనం ఎక్కలేదు.. కమ్యూనిజమే ఇష్టం**

ఇటీవల పవన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలపైనా ఉండవల్లి స్పందించారు. "పవన్ కల్యాణ్‌కు సనాతనం ఎక్కిపోయిందని నేను అనుకోను. ఆయన కమ్యూనిస్ట్ సిద్ధాంతాలను ఎక్కువగా చదివారు. ఏ విషయాన్నైనా గట్టిగా చెబుతారు. ఆయన్ను కలిసినప్పుడు సనాతన ధర్మం గురించి తప్పక అడుగుతాను" అని అన్నారు.

పవన్ కల్యాణ్ ఒక ముఖ్యమంత్రి స్థాయి నాయకుడని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆయన పాత్ర ఎంతో కీలకమని ఉండవల్లి అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉంటే... తిరుమల లడ్డూలో కల్తీ అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు 'గొడ్డు మాంసం' వంటి పదాలు వాడటం ప్రజల్లోకి సరైన సంకేతాలు పంపదని, ఇలాంటి విషయాల్లో చట్టం తన పని తాను చేసుకుపోవాలని సూచించారు.

# ఒక్క రోజులోనే డీఎంకేతో బంధాన్ని తెంచుకుని కాంగ్రెస్ వెళ్లిపోయింది: స్టాలిన్ ఆవేదన

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత నెలకొన్న రాజకీయ అనిశ్చితిపై డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ స్పందించారు. ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో, తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించిన నేపథ్యంలో ఆయన ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఒక్క రోజులోనే డీఎంకేతో బంధాన్ని తెంచుకుని కాంగ్రెస్ పార్టీ వెళ్లిపోయిందని ఆవేదన వెలిబుచ్చారు. కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో స్పందించారు.

"నా ప్రాణంలో ప్రాణంగా కలసిపోయిన ప్రియమైన సోదరులకు, నా ప్రాణ సమానులైన తమిళ ప్రజలకు నా ప్రేమపూర్వక నమస్కారాలు. ఎన్నికల ఫలితాలు ప్రకటించబడిన తర్వాత జరుగుతున్న పరిణామాలను మీరు చూస్తూనే ఉన్నారు. ఏ పార్టీకి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అవసరమైన మెజారిటీ రాని విధంగా శాసనసభ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసే స్థాయిలో ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) నేతృత్వంలోని లౌకిక ప్రగతిశీల కూటమికి సీట్లు రానప్పటికీ, మనం చెప్పుకోదగ్గ ఓట్లను సాధించాం. కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు తాము అడ్డంకిగా ఉండబోమని, డీఎంకే నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తుందని నేను ఇదివరకే మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పాను.

ఆ తర్వాత, నా అధ్యక్షతన జరిగిన శాసనసభ్యుల సమావేశంలో, తుది నిర్ణయం తీసుకునే బాధ్యతను నాకే అప్పగించారు. "పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, పార్టీ ముఖ్య నేతలతో చర్చించి నిర్ణయం తీసుకుంటాను" అని ఆ సమావేశంలో వారికి తెలిపాను. ప్రభుత్వం ఏర్పాటుకు ఎవరికీ మెజారిటీ రాని ఈ పరిస్థితుల్లో, చాలా మంది ప్రత్యామ్నాయ ఆలోచనలు చెప్పారు. నా వరకు, మిత్రపక్షాలు ఏ నిర్ణయం తీసుకున్నా వారి నిర్ణయాన్ని గౌరవించి, సమన్వయంతో పనిచేసి, స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి. మరో ఎన్నికలకు దారితీయకూడదన్నదే నా అభిప్రాయం.

"ప్రస్తుత సంక్షోభాన్ని నివారించేందుకు, మేము తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి మద్దతు ఇస్తున్నప్పటికీ, విధానపరంగా డీఎంకే నేతృత్వంలోని లౌకిక ప్రగతిశీల కూటమిలోనే కొనసాగుతాం" అని మా కూటమిలోని మిత్రపక్షాలు ప్రకటించడాన్ని నేను స్వాగతిస్తున్నాను.

కూటమి తరపున పోటీ చేసి గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలిపేందుకు అన్నా అరివాలయంకు రాలేదు. ఒకే రోజులో డీఎంకేతో బంధాన్ని తెంచుకుని కాంగ్రెస్ పార్టీ వెళ్లిపోయింది. అదే సమయంలో, కమ్యూనిస్ట్ నాయకులు, కామ్రేడ్ షణ్ముగం, కామ్రేడ్ వీరపాండియన్, విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే) అధ్యక్షుడు తిరుమావళవన్ "తమిళనాడు హక్కుల కోసం, ప్రజల సంక్షేమం కోసం డీఎంకేతో కలిసి పోరాడతాం" అని ప్రకటించి స్నేహ భావాన్ని ప్రదర్శించారు. ఇది విధానాలలో బలంగా ఉన్న డీఎంకేపై వారికి ఉన్న నమ్మకాన్ని చూపుతుంది.

ఈ అత్యంత
కీలకమైన, క్లిష్ట సమయంలో మా వెంట నిలిచిన మిత్రపక్ష నేతలు ప్రొఫెసర్ అయ్య కాదర్ మొహిదీన్, అన్న వైగో, సోదరి ప్రేమలత విజయకాంత్, ప్రొఫెసర్ జవాహిరుల్లా, సోదరులు ఈశ్వరన్, తమీమున్ అన్సారీతో సహా అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. వారి నిబద్ధతకు ఎలాంటి కృతజ్ఞతలు, ప్రశంసలు అయినా సరిపోతాయి.గత ఐదేళ్లలో తమిళనాడును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, రాష్ట్రాన్ని సుసంపన్నం చేశాం. ఎన్నో పథకాల ద్వారా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేలా చేశాం. దూరదృష్టి, ప్రణాళికతో కూడిన ఆ పథకాలను ఏర్పడబోయే కొత్త ప్రభుత్వం కూడా కొనసాగించాలన్నది నా వ్యక్తిగత అభిప్రాయం. మహిళలు, యువత, విద్యార్థులు, పిల్లలు, అణగారిన వర్గాలు, ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఉద్దేశించిన అన్ని పథకాలను కొనసాగిస్తే ప్రజలకు మేలు జరుగుతుంది, రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని కొత్త ప్రభుత్వం పనిచేయాలని కోరుకుంటున్నాను.

ఏర్పడబోయే కొత్త ప్రభుత్వానికి మరోసారి నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను" అంటూ స్టాలిన్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

# థాయ్‌లాండ్ గబ్బిలాల్లో కొత్త కరోనావైరస్.. మానవులకు సోకే ప్రమాదం!

- మొదటి పేజీ తరువాయి

జరిగిన ఈ కీలక అధ్యయనం, ప్రముఖ సైన్స్ జర్నల్ 'సెల్'లో ప్రచురితమైంది.

**పరిశోధనలో ఏం తేలింది?**

ఈ కొత్త వైరస్... కోవిడ్-19 మహమ్మారికి కారణమైన SARS-CoV-2, గతంలో విజృంభించిన SARS-CoV-1 వైరస్‌ల కుటుంబమైన 'సార్బెకోవైరస్'కు చెందినది. ఇది మానవ కణాల్లో ఉండే ACE2 రిసెప్టర్‌లకు అతుక్కునే సామర్థ్యాన్ని కలిగి ఉందని పరిశోధకులు కనుగొన్నారు. SARS-CoV-2 కూడా ఇదే మార్గం ద్వారా మానవ శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఈ లక్షణం వల్లే దీనిపై ఆందోళన వ్యక్తమవుతోంది.

అయితే, ఇప్పటివరకు ఈ వైరస్ మానవులకు సోకినట్లు ఎక్కడా ఆధారాలు లేవని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఇది కేవలం శాస్త్రీయంగా గుర్తించిన ఒక సంభావ్య ముప్పు మాత్రమేనని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. జంతువుల నుంచి మానవులకు వైరస్‌లు వ్యాపించే (జూనోటిక్) ప్రమాదాలను ముందుగానే పసిగట్టేందుకే ఈ పరిశోధనలు చేస్తున్నట్లు వివరించారు.

**నిఘా ఎందుకు అవసరం?**

గబ్బిలాలు అనేక రకాల వైరస్‌లకు సహజ ఆశ్రయాలుగా ఉంటాయి. వాటిపై నిరంతరం నిఘా పెట్టడం ద్వారా కొత్త ఆరోగ్య ముప్పులను ముందుగానే గుర్తించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

కోవిడ్-19 మహమ్మారి తర్వాత వన్యప్రాణుల్లోని వైరస్‌లపై ప్రపంచవ్యాప్తంగా పర్యవేక్షణ పెరిగింది. భవిష్యత్ మహమ్మారులను నివారించడానికి ఇలాంటి ముందస్తు హెచ్చరికలు, అంతర్జాతీయ శాస్త్రీయ సహకారం ఎంతో కీలకమని ఈ అధ్యయనం గుర్తుచేస్తోంది.

# రిజిస్టర్డ్ అగ్రిమెంట్ లేకున్నా హక్కులుంటాయ్

- మొదటి పేజీ తరువాయి

వారు 'అలాటీ'లుగానే పరిగణించబడతారని, వారి ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత డెవలపర్‌పై ఉందని తేల్చిచెప్పింది. హైదరాబాద్ కొంపల్లిలో ఓ సంస్థ నిర్మిస్తున్న ప్రాజెక్టులో ఫ్లాట్లు కొనుగోలు చేసిన పలువురు బాధితులు రేరాను ఆశ్రయించారు. 2020-22 మధ్య ఫ్లాట్లు బుక్ చేసుకున్నామని, రెండు, మూడేళ్లలో ఇస్తామన్న డెవలపర్ ఐదేళ్లు గడిచినా నిర్మాణం పూర్తి చేయలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిర్మాణం నెమ్మదిగా సాగుతోందని, డబ్బు వాపసు అడిగినా ఇవ్వడం లేదని వాపోయారు.ఈ ఫిర్యాదులపై విచారణ సందర్భంగా డెవలపర్ తన వాదన వినిపించారు. కొందరు కొనుగోలుదారులతో అధికారికంగా సేల్ అగ్రిమెంట్లు లేనందున వారు అలాటీలు (ఫ్లాట్ అలాట్ మెంట్ పొందినవారు) కాదని పేర్కొన్నారు. మరికొన్ని ఒప్పందాలు అసంపూర్తిగా ఉన్నాయని, ఇంకొందరు పెట్టుబడిదారులు మాత్రమేనని, ఇది సివిల్ వివాదం కిందకు వస్తుందని వాదించారు.డెవలపర్ వాదనలను తెలంగాణ రేరా తోసిపుచ్చింది. రేరా చట్టంలోని సెక్షన్ 2(ఎ) ప్రకారం, డబ్బు చెల్లించిన రసీదులు, అలాట్‌మెంట్ పత్రాలు ఉన్నందున వారంతా అలాటీలేనని స్పష్టం చేసింది. రిజిస్టర్డ్ ఒప్పందం లేకపోవడం హక్కులను నిరాకరించడానికి కారణం కాదని తేల్చిచెప్పింది. వెంటనే ప్రాజెక్టును పూర్తి చేసి, 30 రోజుల్లో దశలవారీగా నిర్మాణ షెడ్యూల్‌ను కొనుగోలుదారులకు అందించాలని ఆదేశించింది. అనుమతులు లేకుండా నిర్మించిన ఫ్లోర్లలోని వారికి 30 రోజుల్లోగా ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా ప్రత్యామ్నాయ ఫ్లాట్లు కేటాయించాలని, లేనిపక్షంలో పూర్తి డబ్బు వాపసు చేయాలని తీర్పులో పేర్కొంది.

బుకింగ్ సమయంలో ఇచ్చిన 36 నెలల గడువుకు చట్టబద్ధమైన ప్రాధాన్యత ఉంటుందని రేరా నొక్కిచెప్పింది. ఈ తీర్పు, నమోదు కాని ఒప్పందాలను సాకుగా చూపి తప్పించుకోవాలనుకునే డెవలపర్లకు చెక్ పెడుతూ, హోమ్‌బయర్ల హక్కులకు మరింత బలాన్ని చేకూర్చింది.

# తమిళనాడు సీఎంగా విజయ్... నేడు ప్రమాణ స్వీకారం

- మొదటి పేజీ తరువాయి

మద్దతు తనకు ఉందని, ఇందుకు సంబంధించిన లేఖలను ఆయన గవర్నర్‌కు సమర్పించారు. విజయ్‌తో భేటీ కోసమే గవర్నర్ తన కేరళ పర్యటనను రద్దు చేసుకోవడం గమనార్హం. ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి విజయ్ గవర్నర్‌ను కలవడం ఇది నాలుగోసారి.తమిళనాడు అసెంబ్లీలో మొత్తం 234 స్థానాలు ఉండగా, ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది సభ్యుల మద్దతు (మ్యాజిక్ ఫిగర్) అవసరం. ప్రస్తుతం టీవీకే బలం 120కి చేరడంతో, విజయ్ ముఖ్యమంత్రి కావడం లాంఛనమే అయింది. ఇవాళ వీసీకేతో పాటు ఐయూఎంఎల్ కూడా టీవీకే పార్టీకి మద్దతు ప్రకటించడం విశేషం. విజయ్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించేందుకు అన్ని అడ్డంకులు తొలగిపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా టీవీకే శ్రేణులు, అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. పలుచోట్ల బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## విశాఖలో 102 కి.మీ. మేర సెమీ రింగురోడ్డు

- మొదటి పేజీ తరువాయి

అందిన వినతుల్లో 90 శాతం పరిష్కరించాం. 6,836 చదరపు కి.మీ పరిధిలో వీఎంఆర్డీఏ విస్తరించి ఉంది. ఈనెల చివరి నాటికి సెమీ రింగురోడ్డు డీపీఆర్ సిద్ధమవుతుంది. భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఏడు కనెక్టింగ్ రోడ్లను వీఎంఆర్డీఏ నిర్మిస్తోంది. ఇప్పటికే మూడు పూర్తయ్యాయి. భోగాపురం ఎయిర్‌పోర్టుకు బీచ్ కారిడార్ ప్రతిపాదన ఉంది. రూ.14వేల కోట్లతో తాగునీటి ప్రాజెక్టు వస్తోంది. ఇది పూర్తయితే 95 శాతం ఇళ్లకు తాగునీరు అందుతుంది" అని మంత్రి నారాయణ వివరించారు. మరో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ ఎకనామిక్ కారిడార్ ఆధారంగా సమీక్ష సమావేశం జరిగిందని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రత్యేక అభివృద్ధి జోన్‌గా మారుతోందన్నారు.

## హైదరాబాద్ ట్రాఫిక్‌లో చిక్కుకున్న చంద్రబాబు కాన్వాయ్

- మొదటి పేజీ తరువాయి

వాహనశ్రేణి ముందుకు కదల్లేని పరిస్థితి ఏర్పడి, సుమారు 10 నిమిషాల పాటు ట్రాఫిక్‌లోనే నెమ్మదిగా కదులుతూ ఉండిపోయింది. ట్రాఫిక్ జామ్ తీవ్రంగా ఉండటంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు తన కారు నుంచి కిందకు దిగారు. భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై ట్రాఫిక్‌ను క్లియర్ చేసే ప్రయత్నం చేశారు. కొద్దిసేపటి తర్వాత ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో చంద్రబాబు కాన్వాయ్ అక్కడి నుంచి ముందుకు కదిలి వెళ్లిపోయింది. ఉన్నతాధికారుల మధ్య సమాచార లోపం వల్లే ఈ గందరగోళం తలెత్తినట్లు తెలుస్తోంది.

## పవన్ తో సినిమా తీయాలనేది నా కోరిక

- మొదటి పేజీ తరువాయి

బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. పవన్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే, ఆయన హీరోగా ఒక భారీ చిత్రాన్ని నిర్మించడానికి తాను సిద్ధంగా ఉన్నానని తన మనసులోని మాటను బయటపెట్టారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలను ప్రశ్నించినందుకే తాను ఆ పార్టీలో ఇబ్బందులు ఎదుర్కొన్నానని బాలినేని సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీలో ఉంటూనే తప్పులను ఎత్తిచూపడం వల్ల తన మంత్రి పదవిని కూడా కోల్పోవాల్సి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించే గొంతుకకు జనసేన సరైన వేదిక అని భావించే తాను ఆ పార్టీలో చేరానని స్పష్టం చేశారు.జనసేనలో చేరే ముందే పవన్ కల్యాణ్‌కు తన ఉద్దేశాన్ని స్పష్టంగా చెప్పానని ఆయన తెలిపారు. తనకు ఎలాంటి పదవుల మీద ఆశ లేదని, కేవలం పార్టీ బలోపేతం కోసం ఒక సామాన్య కార్యకర్తలా పనిచేస్తానని పవన్‌కు హామీ ఇచ్చానని చెప్పారు.

## శ్రీశైలంలో యాత్రికులకు సైబర్ నేరగాళ్ల టోకరా

- మొదటి పేజీ తరువాయి

మోసంపై శ్రీశైలం ఆలయ ఈవో శ్రీనివాసరావు స్పందించారు. యాత్రికులకు అండగా నిలిచారు. వారికి ఉచిత వసతి, భోజనం, దర్శన ఏర్పాట్లు చేయించారు. భక్తుల నుంచి లిఖితపూర్వక ఫిర్యాదును దేవస్థానం పీఆర్‌వో తీసుకున్నారు. సైబర్ నేరగాళ్ల మోసం కేసు పెట్టాలని ఈవో శ్రీనివాసరావు నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు దేవస్థానం తరపున తమకు ఉచిత వసతి, దర్శనం, భోజన ఏర్పాట్లు చేసిన ఈవో, సిబ్బందికి యాత్రికులు కృతజ్ఞతలు తెలిపారు

## పెరగనున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధర?

- మొదటి పేజీ తరువాయి

పడే సూచ నలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు భారీగా పెరగడంతో, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఎదుర్కొంటున్న నష్టాల నేపథ్యంలో మే 15 లోపు ఇంధన ధరల పెంపు తప్పకపోవచ్చని తెలుస్తోంది.

అంతర్జాతీయంగా ముడిచమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుండి ఏకంగా 126 డాలర్లకు చేరుకోవడంతో, చమురు సంస్థలు ప్రతి నెలా దాదాపు రూ. 30,000 కోట్ల నష్టాన్ని చవిచూస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం, చమురు సంస్థలు కలిసి లీటర్ పెట్రోల్‌పై దాదాపు రూ. 24 భారాన్ని భరిస్తూ వినియోగదారులకు ఉపశమనం కలిగిస్తున్నాయి. అయితే, పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడి వల్ల ధరల సవరణ అనివార్యంగా కనిపిస్తోంది.

ఒకవేళ ధరల పెంపునకు ఆమోదం లభిస్తే.. ఎంత పెరిగే అవకాశం ఉంది?

పెట్రోల్, డీజిల్: లీటరుకు రూ. 4 నుండి రూ. 5 వరకు పెరగవచ్చు. వంట గ్యాస్: సిలిండర్‌పై రూ. 40 నుండి రూ. 50 వరకు పెరిగే అవకాశం ఉంది. గత నాలుగు ఏళ్లుగా (2022 నుండి) ఇంధన ధరల్లో పెద్దగా మార్పులు లేవు, కాబట్టి ఇది వాహనదారులపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది.మధ్య ప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలు మరియు హార్ముజ్ జలసంధిలో సరఫరాకు అంతరాయం కలగడం వల్ల ప్రపంచవ్యాప్త చమురు సరఫరాలో 20 శాతం ప్రభావితమైంది. ఇది ముడిచమురు ధరలను ఆకాశానికి చేర్చింది. భారత్ ప్రస్తుతం రష్యా, అమెరికా, పశ్చిమ ఆఫ్రికా దేశాల నుండి దిగుమతులను పెంచడం, ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడం ద్వారా పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తోంది. అయితే, ద్రవ్యోల్బణం పెరగకుండా ఉండటానికి, చమురు సంస్థల ఆర్థిక స్థితిని కాపాడటానికి

# మలినేని సుశీలమ్మ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**సింగరాయకొండ పెన్ పవర్, మే 9**

స్థానిక మలినేని సుశీలమ్మ ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీ (మొదటి బ్యాచ్) నాలుగో సంవత్సరంలోని విద్యార్థినిలు 84 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు అని మలినేని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు తెలిపారు. 82 శాతం మంది వివిధ మల్టీ నేషనల్ కంపెనీలలో ఉద్యోగాలు సాధించిన సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరిమాళ్ళు విద్యార్థులను అధ్యాపక అధ్యాపకేతర బృందాన్ని ప్రశంసించారు. డైరెక్టర్ డాక్టర్ ఏ జీ కే మూర్తి మాట్లాడుతూ సమిష్టి కృషి వల్ల ఇంత మంచి ఫలితాలు సాధించడం పట్ల హర్షం వెలిబుచ్చుతూ విద్యార్థులను అభినందించారు. ప్రొఫెసర్ కోటేశ్వరరావు ,హెచ్ వో డి లు జ్యోతి,వసుమతి, ఏవో వెంకటేశ్వర్లు తదితరులు విద్యార్థులను



అభినందించిన వారిలో ఉన్నారు.

# పెన్ పవర్

## మార్కాపురం - ప్రకాశం

MARKAPURAM మార్కాపురం

## మాదకద్రవ్యాల వినియోగంతో

# కుటుంబాలు ఛిద్రం

### - డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు - ఆపరేషన్ వజ్రప్రహార్’లో భాగంగా కార్డన్ అండ్ సెర్చ్






**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు మే 09**

మాదక ద్రవ్యాల నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడిని లక్ష్యంగా చేసుకుని జిల్లా ఎస్పీ హ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఒంగోలు డిఎస్పీ రాయపాటి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సింగరాయకొండ సిఐ శ్రీహరి, ఒంగోలు సబ్ డివిజన్ 5 మంది ఎస్సైలు , 74 మంది పోలీస్ సిబ్బంది, ఈగల్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి టంగుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని జయవరం గ్రామంలోని ఎన్టీఆర్ కాలనీ పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం‘ఆపరేషన్ వజ్రా ప్రహార్’లో భాగంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఇళ్లు, దుకాణాలు, పాత ముద్దాయిల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. కొత్త వ్యక్తులు యొక్క వివరాలను సేకరించారు. సరైన పత్రాలు లేని 11 బైక్ లను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించి వారి యొక్క వేలిముద్రలను ఫింగర్ ప్రింట్స్ ఐడెంటిఫికేషన్ ద్వారా తనిఖీ చేయటం నేర నియంత్రణకు జిల్లా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత, ప్రజలు గంజాయి సహా అన్ని రకాల మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబ, ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వ్యక్తి తన చర్యలపై నియంత్రణ కోల్పోయి అనేక అనర్థాలకు గురయ్యే ప్రమాదం ఉందని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం, మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల కాల్స్‌కు స్పందించి ఓటీపీలు చెప్పవద్దని హెచ్చరించారు. అలాగే ఆన్‌లైన్ గేమ్స్,క్రికెట్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని, ఆధార్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తాయని చెప్పే మోసగాళ్లను నమ్మకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చట్టాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, ప్రజలతో కలిసి మత్తుకు దూరంగా ఉండాలి – – మత్తు లేని సమాజాన్ని నిర్మిద్దాం అనే ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులు, ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 లేదా డయల్ 112 లేదా పోలీస్ వాట్సప్ నెంబర్ 9121102266 తెలియజేయాలని ప్రజలను కోరారు.

# కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్ వార్షిక దినోత్సవం

**కందుకూరు పెన్ పవర్, మే 9:**





కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వార్షిక దినోత్సవం సందర్భంగా కందుకూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాన్యువల్ ఫంక్షన్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలేటి శ్రీధర్ నాయుడు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా న్యాయవాదులు వార్షిక దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని అలాగే ఈ సంవత్సరం సీనియర్ న్యాయవాది బక్కమంతుల. వెంకటేశ్వర్లు ఆతిథ్యం అందించడం జరిగింది అని అన్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన గౌరవ కందుకూరు అడిషనల్ డిస్టిక్ మున్సిపల్ మెజిస్ట్రేట్ ఎన్.నిఖిల్ రెడ్డి మాట్లాడుతూ న్యాయమూర్తులు, న్యాయవాదులు ఎంతో మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ విధమైన వార్షిక దినోత్సవాన్ని జరుపుకోనటం అభినందించదగ్గ విషయమని, కందుకూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులందరినీ ఒకే చోట చూడటం ఆనందంగా ఉందని తెలిపారు.ఆతిథ్యం అందించిన బివి కి అభినందనలు తెలియజేశారు. ఉదయగిరి కోర్టు మెజిస్ట్రేట్ జె. అంజయ్య మాట్లాడుతూ ఒకప్పుడు ఈ కందుకూరు బార్ అసోసియేషన్ లోనే న్యాయవాదిగా పనిచేసినందు వలన ప్రేమతో ఈ యాన్యువల్ ఫంక్షన్ కు నన్ను ఆహ్వానించిన బి.వి కి కందుకూర్ బారాసోసియేషన్ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.రమేష్ బాబు మాట్లాడుతూ సాంప్రదాయంగా న్యాయవాదులు ఇటువంటి కార్యక్రమంలో అందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బెజవాడ కృష్ణయ్య,సీనియర్ న్యాయవాదులు వై.సాంబశివరావు, కె.వి.లక్ష్మీనారాయణ, సన్నెబోయిన శ్రీనివాసరావు,గౌడపేరి కోటేశ్వరరావు,లింగాబత్తిన బ్రహ్మయ్య, పి.భాస్కరరావు, టి.తిరుమలరావు, బట్టరుశెట్టి సాయి శంకర్, ముప్పవరపు కిషోర్, ఎస్ పవన్ కుమార్, షేక్ సంసుద్దీన్, చుండి.మురళీధర్, డి.మాధవరావు, పోకూరి.కోటయ్య, పండిత్.సంపత్ కుమార్,పెట్లూరి. మురళి, ఎస్.కె జమీర్,మహిళా న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సంవత్సరం ఎంతో ఘనంగా ఆతిథ్యం అందించిన సీనియర్ న్యాయవాది బక్కమంతుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ సంవత్సరం నాకు అవకాశం కల్పించిన కందుకూరు బార్ అసోసియేషన్ సభ్యులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ప్రతి సంవత్సరం ఇదే విధంగా ఐక్యమత్యంగా బార్ అసోసియేషన్ వార్షిక దినోత్సవాన్ని జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

## కిమ్స్ ఆసుపత్రిలో

# అవయవ దానం



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు మే 09**

ఒంగోలు సమీపంలోని ముక్తినూతలపాడు గ్రామానికి చెందిన కొమ్మూరి లక్ష్మయ్య (50) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కిమ్స్ హాస్పిటల్స్, ఒంగోలులో చికిత్స కొరకు కిమ్స్ హాస్పిటల్ ఒంగోలు కు తరలించారు. వైద్యుల నిర్ధారణ ప్రకారం బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం అవయవదానం పై అవగాహనా కల్పించారు. పెద్ద మనసుతో కొమ్మూరి కుటుంబ సభ్యులు అంగీకరించారు. వెంటనే ఆసుపత్రి వైద్యులు జీవన్ దాన్ కు దరఖాస్తు చేయగా వారు అన్ని ఏర్పాట్లు చేశారు. మృతుడి భార్య కొమ్మూరి నాగదేవి, కుటుంబ సభ్యులు తీసుకున్న ఈ మానవతా నిర్ణయం ద్వారా పలువురు రోగులకు పునర్జీవం లభించే అవకాశం కలిగింది. దానం చేసిన అవయవాలలో ముఖ్యంగా మూత్రపిండాలు, కాలేయం మరియు ఇతర అవయవాలను అవసరమైన రోగులకు విజయవంతంగా మార్పిడి చేయడానికి వైద్య బృందం సమన్వయంతో చర్యలు చేపట్టింది. ప్రకాశం జిల్లా లో కిమ్స్ హాస్పిటల్స్, ఒంగోలు నందు ఇది తొలి అవయవ దానం ఘటన కావడం విశేషం. ఈ సందర్భంగా కిమ్స్ హాస్పిటల్స్ డిప్యూటీ మెడికల్ డైరెక్టర్ డా. కె. అజయ్ కృష్ణ మాట్లాడుతూ, అవయవ దానం అనేది అత్యున్నతమైన మానవతా సేవగా పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ అవగాహన చెందాలని కోరారు. ఎమర్జెన్సీ ఫిజీషియన్ డా. బాల మురళి కృష్ణ మాట్లాడుతూ, బ్రెయిన్ డెత్ తర్వాత అవయవ దానం ద్వారా అనేక మందికి కొత్త జీవితం అందించవచ్చని వివరించారు. అలాగే ఆసుపత్రి వైద్య బృందం సమన్వయంతో అన్ని వైద్య ప్రక్రియలు సక్రమంగా నిర్వహించబడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కిమ్స్ డైరెక్టర్ బొల్లినేని ఆద్విక్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కాకునూరి అంకి రెడ్డి, రీజినల్ సి ఇ ఓ డాక్టర్ వి. ప్రవీణ్ కుమార్, వైద్యుల బృందం మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేసి, వారి ఈ గొప్ప నిర్ణయాన్ని అభినందించారు. ఈ ఘటన అవయవ దానం ప్రాముఖ్యతను మరోసారి చాటి చెబుతూ, సమాజానికి ఆదర్శంగా నిలిచింది.




# కమణీయం నెమలిగుండ్ల రంగనాయక స్వామి కళ్యాణం

## పాల్గొన్న అశేష భక్తులు

## గోవింద నామస్మరణతో మార్మోగిన నలమల్ల





**గిద్దలూరు పెన్ పవర్ మే 9**

గిద్దలూరు నియోజకవర్గంలో నలమల్ల కీకారణ్యం ప్రకృతి సోయగాల మధ్య వెలసిన ఈప్రాంత వాసుల ఇలవేల్పు కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారం నెమలిగుండ్ల రంగనాయక స్వామి కళ్యాణం శనివారం నాడు కమణీయంగా నిర్వహించారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన ఇరువురు దేవేరుల సమేత రంగడి ఉత్సవమూర్తులను భాజా భజంత్రీలు, మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కళ్యాణ వేదిక వద్దకు వేంచేపింప చేశారు . ఈ సందర్భంగా భక్తులు గోవింద నామస్మరణ లతో నలమల్ల గిరులు మార్మోగాయి. ఆ తరువాత ఆలయ అర్చకులు సత్యనారాయణ ఆచార్యులు , పాండురంగాచార్యులు వెంకట రంగాచార్యులుకళ్యాణ తంతును ప్రారంభించారు. మొదట నెమలిగుండ్ల రంగడి ప్రవర, అమ్మవార్ల ప్రవరను శాస్త్రోక్తంగా వర్ణించారు యజ్ఞోపవిత్ర ధారణ.ఇక వరుసగా జీలకర్ర బెల్లం , మాంగళ్య ధారణ, తలంబ్రాలు కార్యక్రమాలను నిర్వహించారు. కళ్యాణం చూడముచ్చటగా కమణీయంగా నిర్వహించారు , స్వామికి పలువురు పట్టువస్త్రాలు సమర్పించారు. వేలాదిగా భక్తులు పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం దండల మార్పిడి లో అర్చకుల నృత్యం భలేగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణ మూర్తులను గుడిఉత్సవం నిర్వహించారు. శలవు లు కావటంతో ఎండలను సైతం లెక్కచేయకుండా భక్తులు పొరుగుప్రాంతలు, రాష్ట్రాలనుండి తరలి వచ్చారు . ఆలయ ధర్మల కమిటీ చైర్మన్ ఎస్ నరసింహులు ఈ ఓ నాగయ్య లు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. స్వామివారి దర్శనానికి రెండు గంటలు సమయంపట్టింది. భక్తులు అధిక సంఖ్యలో రావటంతో కొంతసేపు ట్రాఫిక్ జామ్ అయింది . రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు ట్రాఫిక్ ను అదుపుచేసి వాహనాలను పంపించారు , ఆలయం , నెమలిగుండం వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ముప్వా కొండయ్యకు నివాళులర్పించిన ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు పెన్ పవర్, మే 9**

సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు, హోమియో డాక్టర్ గా సుదీర్ఘకాలం సేవలందించిన ముప్వా కొండయ్య అనారోగ్యంతో కన్నుమూశారు. కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు బడేవారిపాలెం గ్రామంలో కొండయ్య భౌతికకాయానికి నివాళు లర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ముప్వా కొండయ్య హోమియో డాక్టర్ గా కందుకూరు ప్రాంత ప్రజలకు మంచి సేవలు అందించారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. సిపిఎం పార్టీ నాయకుడిగా, అనేక ప్రజా పోరాటాల్లో పాలుపంచుకుని, పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. డాక్టర్ కొండయ్య తో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు.

# మానవత ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం పంపిణీ



**కందుకూరు పెన్ పవర్, మే9**

కందుకూరు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ తరపున శనివారం గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.కందుకూరు కోవూర్ రోడ్డు లో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమానికి విచ్చేసిన గర్భిణులకు వేరుశనగ ముద్దలు, అరటి పండ్లు, యాపిల్, పండ్లు,బత్తాయి పండ్ల తోపాటు గొడుగు,వాటర్ బాటిల్ ను అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ స్టెల్లా కారుణ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ మానవతా సంస్థ ద్వారా గర్భిణీ స్త్రీలకు మానవత సమస్య ద్వారా పౌష్టికాహారాన్ని అందించాలని సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ప్రెసిడెంట్ గుర్రం చిన్న అల్లూరయ్య మాట్లాడుతూ మానవత ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్. ఇంటూరి పద్మావతి, మానవతా సంస్థ చైర్మన్ శశిధర్ రెడ్డి, అధ్యక్షులు గుర్రం చినఅల్లూరయ, ట్రెజరర్ ఓరుగంటి శివ శంకర్ రావు, సెక్రెటరీ గౌస్ మొయిద్దీన్, వైస్ చైర్మన్ మాలకొండయ్య, డైరెక్టర్స్ కే.రమేష్ ,మేమిడి నాగరాజు, చిత్తూరు వెంకటేశ్వర్లు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జిల్లెళ్ళ ఆదినారాయణను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 9**

సి ఎస్ పురం మండలం కోవిలంపాడు గ్రామానికి చెందిన జిల్లెళ్ళ ఆదినారాయణ అనారోగ్యం కారణంగా వైద్యశాలలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు .కనిగిరి మాజీ ఎమ్మెల్యే ,విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు ఆయన నివాస గృహానికి వెళ్లి పరామర్శించారు .ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకొని వేసవి కాలం దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు .ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు మునగల వెంకట నారాయణ రెడ్డి ,నారాయణస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి ,గోను చంద్రశేఖర్ రెడ్డి ,దాసరి నారాయణస్వామి ,జిల్లెళ్ళ విష్ణు నారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు .

# శ్రీ వివేకానంద కళాశాల పూర్వ విద్యార్థిని,విద్యార్థులు ఔదార్యం

**గిద్దలూరు పెన్ పవర్ మే 9**

శ్రీ వివేకానంద కళాశాల పూర్వ విద్యార్థిని, విద్యార్థులు 83/85/88 బ్యాచ్ ఆధ్వర్యంలో గిద్దలూరు గవర్నమెంట్ హాస్పిటల్ లో గర్భిణీ స్త్రీలకు 70 మంది అన్నవితరణ కార్యక్రమము , పేషంట్లకు పండ్లు పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భముగా గిద్దలూరు బాలికల పాఠశాలల్లో చదివిన సి. ఉమాదేవి పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 600/582 మార్కులు సాధించి మండల సాయి ఫస్ట్ సాధించినందుకు డాక్టర్ కె వి సుధాకర్ చేతుల మీదుగా ఉమాదేవిని సత్కరించారు పూర్వ విద్యార్థి పి ఎల్ ఎమ్ శ్రీనివాస శర్మ 5000 రూపాయలు ఉమాదేవికి బహుకరించారు. కార్యక్రమంలో గిద్దలూరు బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోలా నాగభూషణ్ రెడ్డి పాల్గొన్నారు . శ్రీ సాయిబాబా మందిరంలో వినుత విద్యానికేతన్ హై స్కూల్ లో చదువుతున్న కె. శ్రీ వర్ష 597/600 మార్కులతో జిల్లా ఫస్టుగా, స్టేట్ థర్డ్ నిలిచిన శ్రీవర్ష ను కూడా సత్కరించారు ఖాదర్ వలీ, దీన సాహిదు, పిచ్చిరెడ్డి, ప్రసాదు లు ఈకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు హైస్కూలు కరస్పాండెంట్ ఖాజావలి పాల్గొన్నారు .



కాశయ్య, సూర్య సుబ్బరాయుడు ట్రెజరర్, సిరిగిరి వెంకటేశ్వర్లు, టీచర్ ప్రసాదు, సుబ్బయ్య జి. కాశయ్య ఎల్ఐసి ఏజెంట్, ప్రసంగి, రవి, పోలయ్య చెక్క శ్రీనివాసులు, గజ శ్రీనివాసులు పాల్గొన్నారు. గర్భిణీ



స్త్రీలకు అన్నదాన కార్యక్రమము శ్రీనివాస శర్మ ,ఏ విద్యావతి లు ఏర్పాటు చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించండి

## హెచ్ఎం షేక్ ఖాదరున్నీసా బేగం



**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 9**

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఆధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదరున్నీసా బేగం అన్నారు.మండల కేంద్రంలోని సి ఎస్ పురం పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలోని గృహాలను శనివారం విద్యార్థుల నమోదు కార్యక్రమం (ఎన్రోల్మెంట్ డ్రైవ్)ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదరున్నీసా బేగం ఆధ్వర్యంలో సి ఎస్ పురం లో ఇంటింటికి వెళ్లి పలు గృహాలను సందర్శించి పిల్లలు తల్లిదండ్రులను కలుసుకొని పాఠశాల గురించి వివరించి కుటుంబాల్లో ఉన్న చిన్నారుల వివరాలను తెలుసుకుని, వచ్చే విద్యా సంవత్సరానికి పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదరున్నీసాబేగం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు క్రమశిక్షణ, క్రీడలు, ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. పాఠశాలలో ఆధునిక తరగతి గదులు, డిజిటల్ బోధన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఉన్నత లక్ష్యాలను సాధించేలా పాఠశాలలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ , మధ్యాహ్న భోజనం పథకం, తల్లికి వందనం పథకం వంటి అనేక సదుపాయాలను అందిస్తుందని పిల్లలను పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ షేక్ హుస్సేన్ బీ, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సిబ్బందికి కూలింగ్ కిట్ అందజేత





**కందుకూరు పెన్ పవర్, మే9**

పట్టణ పరిధిలో మండుటెండలు సైతం లెక్కచేయకుండా ట్రాఫిక్ నియంత్రణ కోసం పనిచేస్తున్న ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి వేసవి తాపం నుండి ఉపశమనం అందించే ఆలోచనతో కందుకూరు సిఐ షేక్ అన్వర్ బాషా, కందుకూరు టౌన్ ఎస్సై పులి శివ నాగరాజు లు చలువ కళ్లద్దాలు, తెలుగు రంగు టోపీ, వాటర్ బాటిల్ లను ట్రాఫిక్ సిబ్బందికి అందించారు.ఈ సందర్భంగా కందుకూరు సిఐ మాట్లాడుతూ ఎండలు బాగా ఎక్కువగా ఉండటం వలన డిహైడ్రేషన్ గురవుతారనీ, వాటర్ బాటిళ్లు,ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు క్యారీ చేస్తూ జాగ్రత్తలు తీసుకుంటూ వడదెబ్బకు గురికాకుండా ఉండాలని సిబ్బందికి సూచించారు. కందుకూరు పట్టణ ఎస్సై మాట్లాడుతూ ట్రాఫిక్ సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తగు జాగ్రత్తలు నిమిత్తం కూలింగ్ పరికరాలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.

# తిరుమలనాథ స్వామి ఆలయంలో ఘనంగా శ్రావణ నక్షత్రం వేడుకలు -స్వామి వారి సన్నిధిలో టిడిపి నాయకులు

**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 9**

మండలంలోని అయ్యలూరివారిపల్లి పంచాయతీ పరిధిలో తిరుమల కొండపై వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథ స్వామి ఆలయంలో శ్రీవారి శ్రావణ నక్షత్రం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమమునకు మండల టిడిపి సీనియర్ నాయకులు తులాబందుల చలమయ్య నాయుడు ఆహ్వానం మేరకు మండల టిడిపి నాయకులు రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, సీనియర్ టిడిపి నాయకులు నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ డైరెక్టర్ కోనంగి వెంకటకొండయ్య, మాజీ ఎంపీటీసీ గోదాసు జయరాములు తదితరులు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్వామివారి సేవకుడు పత్తి రామమూర్తి ఆలయానికి విచ్చేసిన అతిథులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం దేవస్థానం తరపున నాయకులను శేష వస్త్రాలతో సత్కరించి అభినందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ



సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ పురాతన దేవాలయం తిరుమలనాథ స్వామి ఆలయానికి ఎంతో చారిత్రక ప్రాధాన్యత ఉన్నదని ఆలయ అభివృద్ధికి భక్తులు దాతలు ప్రజలందరూ ఆలయ కమిటీ వారికి సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పేదింటికి సహాయం





**జరుగుమల్లి పెన్ పవర్, మే 9**

మండలంలోని ఎడ్లూరుపాడు గ్రామానికి చెందిన పేరం లక్ష్మమ్మ భర్త అంకయ్య(లేట్)వారి యొక్క ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేని కారణం చేత పెచ్చులూడిపోయి అధ్వానంగా ఉన్న వారి ఇంటి దుస్థితిని గమనించిన ఎడ్లూరుపాడు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ఉండవల్లి రాములు మూడు ట్రక్కుల ఇసుక,20 సిమెంట్ బస్తాలు 3000 రూపాయలు సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన మన రైతన్న ఫౌండేషన్లి తరపున 550 ఇటుకలు 8 సిమెంట్ బస్తాలు సహాయం అందజేశారు. సదరు గృహం ఇప్పుడు పూర్తిగా ప్లాస్టింగ్ చేయబడి, బాత్రూమ్ నిర్మించబడి నూతన గృహాన్ని తలపిస్తున్నదని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఇంటికి అవసరమైన మెటీరియల్ సప్లై చేసే విషయంలో మన రైతన్న ఫౌండేషన్ సభ్యులు పొన్నగంటి సురేష్, బాశం కోటేశ్వరరావు దగ్గరుండి పనులు చేయించారు.

# ముప్వా కొండయ్యకు సిపిఐ నేతల నివాళి



**కందుకూరు పెన్ పవర్, మే 9:**

సిపిఎం నేత ముప్వ కొండయ్య ఆరోగ్య రీత్యా శుక్రవారం మరణించారు విషయం తెలుసుకున్న సిపిఐ నేతలు బడేవారిపాలెంలోని కొండయ్య స్వగృహం వద్ద ఉన్న ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు మాట్లాడుతూ సిపిఎం పార్టీ నాయకుడిగా, అనేక ప్రజా పోరాటాల్లో పాలుపంచుకుని, పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని ఆయన తెలిపారు. డాక్టర్ గా ఆనాటి కాలంలోనే పేద ప్రజలకు వైద్యం అందించి సేవలందించిన ఘనత కొండయ్యది అని ఆయన అన్నారు. ఆయన మరణం సిపిఎం పార్టీకి తీరని లోటు అని ప్రజా సమస్యలకు గల మెత్తే గొంతు మూగబోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు నివాళులర్పించిన వారిలో సిపిఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి యర్రంశెట్టి ఆనందమోహన్, ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు చేవూరి దుర్గాప్రసాద్, సిపిఐ నాయకులు రామ్మూర్తి తదితరులు ఉన్నారు.

# 50 శాతం రాయితీతో వ్యక్తిగత వ్యవసాయ పరికరములు -ఎఓ... శివగంగ ప్రసాద్

**అర్ధవీడు, పెన్ పవర్, మే 9**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025 ఎస్ఎంఏఎం పథకం ద్వారా రైతులకు 50 శాతం రాయితీతో వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లను అందజేస్తుందని ఇంచార్జ్ మండల వ్యవసాయ అధికారి జి శివగంగ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ పథకంలో ఎస్సీ ఎస్టీ మరియు మహిళా రైతులు మరియు చిన్న సన్నకారు రైతులకు 50శాతం రాయితీతో ఇవ్వనుంది. జనరల్ కేటగిరి పెద్ద రైతులకు 40 శాతం రాయితీతో వ్యవసాయ పరికరములు ఇవ్వనుంది. ఈ పథకంలో వ్యవసాయ పరికరములను 9 రకాలుగా విభజించి వాటిలో వివిధ రకాల వ్యవసాయ పనిముట్లను మరియు రేట్లను పొందుపరచడం జరిగిందన్నారు. ఒక రైతు కుటుంబంలో 50 వేలకు మించకుండా వ్యవసాయ పరికరం లను ఇవ్వనుంది. అదేవిధంగా వ్యవసాయ శాఖ ద్వారా టాక్టర్లు, ట్రాలీలు, రోటవేటర్లు, మినీ ట్రాక్టర్లు, తుమ్మి చెక్కల గురు మల్టీక్రా ప్రెషర్లు, చాప్టర్లు బ్రష్ కట్టర్లు, త్రైవాన్స్ స్ప్రేయర్లు మొదలగు అన్ని రకాల వ్యవసాయ పరికరాలను ఇస్తున్నామని ఇంచార్జ్ మండల వ్యవసాయ అధికారి తెలియజేశారు. ఏమైన రైతులకు సందేహం ఉన్నచో మీ దగ్గరలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి మీయొక్క సందేహాలకు పరిష్కారం తెలుసుకోవాల్సిందిగా కోరారు. వ్యవసాయ పరికరాలను రైతులు పబ్లిక్ వెబ్సైట్ అగ్రికల్చర్ ఫార్మేషన్ యాప్ ద్వారా స్వతహాగా మీసేవ నందు చేసుకోవాలని తెలియజేశారు.

# ఘనంగా కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

## సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులు

## ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు





**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 9**

కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో శుక్రవారం రాత్రి ఫ్రెషర్స్ డే వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కళాశాల రెండవ సంవత్సరం విద్యార్థినీ విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం కళాశాల ఆవరణ లో విద్యార్థుల సందడి, కేరింతలు, రంగురంగుల అలంకరణలు, సాంస్కృతిక ప్రదర్శనలతో కళకళలాడింది.ఈ కార్యక్రమానికి కళాశాల వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల స్థాపించిన తర్వాత విద్యార్థినీ విద్యార్థులు సాధించిన విజయాలను అభినందించారు విద్యార్థులకు నాణ్యమైన వ్యవసాయ విద్య అందించాలనే ఉద్దేశంతో కళాశాలను ఏర్పాటు చేశామని అన్నారు కళాశాలలో విద్యా బోధన గదులు అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం హాస్టల్ సదుపాయాలు, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించామని తెలిపారు కళాశాలలో చదివిన అనేక మంది విద్యార్థులు వ్యవసాయ రంగంలోనే కాకుండా వివిధ ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ఉన్నత స్థానాల్లో స్థిరపడి కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చారని అలాగే కళాశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడ పోటీలలో పాల్గొని విజయం సాధించి కళాశాలకు పేరు తెచ్చిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్ డే కార్యక్రమాలు నిర్వహించిన రెండవ సంవత్సరం విద్యార్థులను అభినందించారు కళాశాల విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు పాటలు స్కిట్లు, వినోదాత్మక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి పాటలకు విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు మునగల వెంకటనారాయణ రెడ్డి, యం కాశిరెడ్డి, మామిడేల కిషోర్, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ధ్వజస్తంభ ప్రతిష్ట ముత్తుముల క్రిష్ణ కిషోర్ రెడ్డి





**గిద్దలూరు పెన్ పవర్ మే 9**

గిద్దలూరు మండలం అక్కలరెడ్డి పల్లె గ్రామంలో జరుగుతున్న కోదండరామ స్వామి ధ్వజ స్తంభ ప్రతిష్ట వేడుక మహోత్సవ కార్యక్రమం లో గిద్దలూరు నియోజకవర్గ శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు ముత్తుముల క్రిష్ణ కిషోర్ రెడ్డి, పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గ్రామ టీడీపీ నాయకులు క్రిష్ణ కిషోర్ రెడ్డి కి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు, అనంతరం. ఆలయం లో పూజాధికార్యక్రమలు నిర్వహించి, ధ్వజ ప్రతిష్ట లో పాల్గొన్నారు. గోవింద నామస్మరణలు , వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ధ్వజ ప్రతిష్ట చేశారు. కార్యక్రమంలో గిద్దలూరు మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు , గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయానికి భారీగా తరలివచ్చిన భక్తులు

## భారీగా ట్రాఫిక్ జామ్





**రాచర్ల,**

రాచర్ల మండలం జేపీ చెరువు గ్రామ సమీపంలోని నలమల్ల కీకారణ్యం ప్రకృతి సౌందర్యాల మధ్య వెలసిన ఈ ప్రాంత వాసుల ఇలావేల్పు శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయానికి శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. దాంతో వాహనాల రద్దీ కారణంగా రాకపోకలు స్తంభించాయి. సమాచారం అందుకున్న ఎస్సై కోటేశ్వరరావు, పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ను పునరుద్ధరించారు. వేసవి సెలవులు కావడం కాకుండా రెండవ శనివారం స్వామివారి మాస కల్యాణం జరుగుతున్న నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చారు, దైవదర్శనం కోసం రెండు మూడు గంటలకు పైగా సమయం పడుతోందని భక్తులు తెలిపారు.

# విశ్వబ్రాహ్మణ ప్రతిభావంతుల విద్యార్థులకు అభినందన సభ

## విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం

## విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు వడ్లమాని నారాయణ చారి

**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 9**

విశ్వబ్రాహ్మణ విద్యార్థుల్లో విద్యా పట్ల ఆసక్తి పెంపొందించి ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అభినందన సభ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు వడ్లమాని నారాయణ చారి తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో 2025-26 విద్యా సంవత్సరంలో పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన విశ్వబ్రాహ్మణ విద్యార్థినీ విద్యార్థులు 10 వ తరగతిలో 540 మార్కులు ఇంటర్మీడియట్ లో 900 మార్కులకు పైగా సాధించిన విద్యార్థినీ విద్యార్థులు తమ మార్కుల జాబితాను ఈ నెల 15వ తేదీ లోపు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి మరియు విద్యాభివృద్ధి కమిటీ చైర్మన్ అద్దంకి వెంకట అజయ్ కుమార్ కు పంపించాలని కోరారు విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించడం, ఉన్నత విద్యపై ఆసక్తిని పెంపొందించడం లక్ష్యంగా ఈ అభినందన సభను నిర్వహిస్తున్నట్లు, ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి సన్మానించడం ద్వారా మరింత మంది విద్యార్థులు విద్యలో రాణించేలా ప్రోత్సాహం కలుగుతుందని అన్నారు ఈ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం 9949944812 ఫోన్ నంబర్ ను సంప్రదించాలని సూచించారు.



జిల్లాలోని విశ్వబ్రాహ్మణ కుటుంబాల విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# బండపందెం ప్రారంభించిన ముత్తుముల క్రిష్ణ కిషోర్ రెడ్డి





**గిద్దలూరు పెన్ పవర్ మే 9**

గిద్దలూరు మండలం నల్లగట్ల గ్రామంలో జరుగుతున్న శ్రీ సీత, రామచంద్ర స్వామి, అభయ ఆంజనేయ స్వామి, అంకాలమ్మ, పోలేరమ్మ 9వ వార్షికోత్సవ వేడుక మహోత్సవ కార్యక్రమం లో గిద్దలూరు టిడిపి సీనియర్ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి పాల్గొని ఆలయాయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఆలయకమిటి ఆయనకు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు .పూజల అనంతరం కృష్ణకు అర్చకులు వేదాశీస్సులు అందజేసి శేషవస్త్రం బహుకరించి తీర్థప్రసాదాల నొసంగారు . అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఏర్పాటుచేసిన ఎడ్ల బండ లాగుడు పందెల పోటీలను ప్రారంభించారు. సాధారణ రైతు వలె తలపాగా చుట్టి చేత చర్నాకోలా, ముల్లుకర్ర, పగ్గాలుపట్టుకొని ఎడ్లను అదిరించి బండపందెంను ప్రారంభించారు. అశేషప్రజాలు తిలకిస్తుండగా బండ పందెం ఉత్కంఠ భరితంగా సాగింది. కార్యక్రమంలో గిద్దలూరు మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# తనిఖీ ప్రజల భద్రతే లక్ష్యంగా సి.ఐ.రామకోటయ్య బృందం కార్డెన్ సెర్చ్



**గిద్దలూరు పెన్ పవర్ మే 9**

రాచర్ల మండల అనుమలవీడు గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు భారీ కార్డెన్ సెర్చ్ (మెరుపు తనిఖీలు) శనివారం నిర్వహించారు. గిద్దలూరు రూరల్ సి.ఐ. రామకోటయ్య నేతృత్వంలో జరిగిన ఈఆపరేషన్లో పోలీసులు గ్రామాన్ని జల్లెడ పట్టారు. నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంలో భాగంగా సి.ఐ. రామకోటయ్య ఈ తనిఖీలను పర్యవేక్షించారు. ఆయనతో పాటు రాచర్ల ఎస్.ఐ. కోటేశ్వరరావు తమ సిబ్బందితో కలిసి గ్రామంలోని ప్రతి వీధిని, అనుమానిత ప్రాంతాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా అధికారులు ప్రదర్శించిన చొరవను గ్రామస్తులు ప్రత్యేకంగా గమనించారు. అనుమానితుల విచారణ అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని, సి.ఐ. రామకోటయ్య స్వయంగా వారి వివరాలను సేకరించి విచారించారు. సరైన పత్రాలు లేకుండా తిరుగుతున్న వాహనాలపై పోలీసులు కొరడా ఝులిపించారు. మొత్తం 31 బైకులను స్వాధీనం చేసుకోగా, అందులో ఎటువంటి ఆధారాలు లేని 3 వాహనాలను సీజ్ చేశారు. ప్రజలకు భరోసా కల్పించినఎస్.ఐ.కోటేశ్వరరావు ఎస్.ఐ. కోటేశ్వరరావు ఈతనిఖీల సమయంలో ప్రజలతో మమేకమై, ఎవరైనా కొత్త వ్యక్తులు లేదా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# నీలకంఠేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణమునకు రూ:50,516/- విరాళం

**గుడ్లూరు, పెన్ పవర్, మే 09:**

మండల కేంద్రమైన గుడ్లూరులో శ్రీ నీలకంఠేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణమునకు గుడ్లూరు గ్రామానికి చెందిన కీర్తిశేషులు కోకా సుబ్బారావు ధర్మపత్ని కోకా పుష్పవతి రూ:50,516/- ల విరాళం ను ఆలయ కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు. శ్రీ నీలకంఠేశ్వరస్వామి వారి ఆశీస్సులు ఆ కుటుంబమునకు ఎల్లవేళలా ఉంటాయని ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు అన్నారు. శ్రీ నీలకంఠేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణమునకు దాతలు ముందుకు వచ్చి విరాళాలను అందించాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సోమానాయుడు, పువ్వాడి వేణుగోపాల్, మేకపోతుల రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ హర్షిణిలో ప్రాంగణ ఎంపికలు

## - ఎంపికైన 73 మంది విద్యార్థులు

**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు మే 09**

శ్రీహర్షిణి డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థి ధనంకుల. శ్రీను రూ 7.5 లక్షల ప్యాకేజీ తో ఇన్ఫోసిస్ కంపెనీ కు ఎంపిక అయ్యారు. శనివారం నాడు అలోరిక,సియట్, టాటా ఎలక్ట్రానిక్స్, ఏసిఈ వారి ప్రాంగణ ఎంపికలు జరిగాయి.ఈ ఎంపికలలో అలోరిక కంపెనీ రూ 3. 9 లక్షల ప్యాకేజీ తో మొత్తం 2 మంది విద్యార్థులు, సియట్ కంపెనీ 3.1 లక్షల ప్యాకేజీ తో 48 మంది, టాటా ఎలక్ట్రానిక్స్ 2.6 లక్షల ప్యాకేజీ తో 18 మంది, ఏసిఈ కంపెనీ లో 5 గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కేవలం డిగ్రీ మాత్రమే కాకుండా డిగ్రీతో పాటు క్యాంపస్ ప్లేస్మెంట్స్ ను కూడా నిర్వహిస్తున్న ఏకైక విద్యాసంస్థ శ్రీ హర్షిణి అని తెలియజేశారు. అదేవిధంగా 100% ప్లేస్మెంట్స్ ఎలక్ష్యంగా శ్రీహర్షిణి మహిళా ఇంజనీరింగ్ కాలేజీని స్థాపించడం జరిగిందని తెలియజేశారు. ఎంపిక కాబడిన విద్యార్థినీ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.ఇంకా ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీ గోరంట్ల కవిత, ఎండీ గోరంట్ల హర్షిత్, డీన్ దాది ఆంజనేయులు, జీఎం ఆర్ల శివరాం,ప్రిన్సిపల్ నాగేంద్ర, ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.



# గృహప్రవేశ వేడుకలో ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు పెన్ పవర్ మే 9**

గిద్దలూరు పట్టణంలోని శ్రీనివాస నగర్ లో హుస్సేనయ్య (అగ్రిగోల్డ్) గృహప్రవేశ మహోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని హుసేనయ్యకు శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో గిద్దలూరు పట్టణ టీడీపీ నాయకులు, ప్రముఖులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కర్పూరపు అశోక్ వివాహవేడుకలో పాల్గొన్న బుర్రా మధుసూదన్ యాదవ్

**గుడ్లూరు, పెన్ పవర్, మే 09**

నియోజకవర్గ వైసిపి స్టూడెంట్ వింగ్ అధ్యక్షులు కర్పూరపు అశోక్ వివాహ వేడుకకు కందుకూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ శనివారం హాజరయ్యారు. మండల కేంద్రమైన గుడ్లూరులో ఉన్న గుండా ఆదిశేషయ్య, వరలక్ష్మి కళ్యాణ మండపంలో జరుగుతున్న అశోక్, మహేశ్వరి ల వివాహ కార్యక్రమం వద్దకు చేరుకొని వధూవరులను ఆశీర్వదించి, శు భాకాంక్షలు తెలియజేశారు.. అనంతరం వారి కుటుంబ సభ్యులతో, స్థానిక నాయకులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు తోకల కొండయ్య, గంగిరెడ్డి, కాపులూరి మురార్జీ, చీమల రాజా, నెల్లూరు జిల్లా స్టూడెంట్ వింగ్ అధ్యక్షులు అర్షిత్ రెడ్డి, నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షులు పాలవెల్లి అమర్నాథరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బిల్లా రమణయ్య, గుడ్లూరు, ఉలవపాడు మండల అధ్యక్షులు కాపులూరి కృష్ణ, నన్నం పోతురాజు, నియోజకవర్గ



సోషల్ మీడియా అధ్యక్షులు కాపులూరి మధుసూదన్, మండల ఉపాధ్యక్షులు కాట్రగడ్డ వెంకట్రావు, వైస్ ఎంపీపీ మొరబోయిన



శ్రీరాములు, నక్కల కళ్యాణ్, స్థానిక నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## 12న డి.జి.పేటలో హనుమాన్ జయంతి వేడుకలు



**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 9**

మండలంలోని డి జి పేట గ్రామంలో ఈ నెల 12వ తేదీన హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.వేడుకలలో భాగంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వామివారికి ఆకు పూజ, ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సంప్రదాయ చెక్కభజన, భక్తి గీతాలు, హనుమాన్ స్వామి వైభవాన్ని ప్రతిబింబించే పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించి విజయవంతం చేయాలని కోరారు.

## వైద్య వ్యవస్థను ధ్వంసం చేస్తున్న కూటమి

### వైసీపీ మైనార్టీ నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్





**మార్కాపురం పెన్ పవర్ మే9**

వైసిపి హయాంలో ప్రజలకు రక్షణ కవచంగా నిలిచిన వైద్య వ్యవస్థను కూటమి సర్కారు వచ్చి వాటిని సర్వనాశనం చేసిందని వైసీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ విమర్శించారు. చాలా ఆసుపత్రులలో సరైన సౌకర్యాలు లేని కారణంగా రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే వైసిపి హయాంలో సకల సౌకర్యాలతో వైద్య వ్యవస్థ చాలా ప్రతిష్టంగా ఉండేదని ఆయన గుర్తు చేశాడు. నేటి ప్రభుత్వ ఆసుపత్రుల దుస్థితిని చూస్తున్న రాష్ట్ర ప్రజలు నాటి వైసిపి పాలనలోని వైద్య వ్యవస్థను గుర్తు చేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా కూటమి సర్కార్ వైద్య ఆసుపత్రులలో సకల సౌకర్యాలు సమకూర్చాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన వైసిపి ఉద్యమిస్తుందని ఆయన హెచ్చరించారు. వైసిపి పాలనలోని వైద్యావ్యవస్థ పతిష్టంగా ఉంటుందని త్వరలోనే జగనన్న సీఎం అవుతారని ప్రజలకు ఆరోగ్య భద్రత లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

## హనుమాన్ జయంతి తిరునాళ్ల కు కదిరి బాబురావు 75 వేలు విరాళం

**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 9**

కనిగిరి పట్టణం లోని కొత్తూరులో ఈ నెల 12వ తేదీన జరిగే హనుమాన్ జయంతి తిరునాళ్ళ మహోత్సవానికి కనిగిరి మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం పార్లమెంట్ వైసీపీ పరిశీలకులు కదిరి బాబురావు 75 వేలు రూపాయలు విరాళాన్ని శనివారం కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో తమ్మనేని శ్రీరామ్ రెడ్డి ,ఎమ్ శ్రీహరిరెడ్డి,ఆప్టా వ్యవస్థాపక అధ్యక్షులు చందు శ్రీనివాస్,మాజీ కౌన్సిలర్ షేక్ ఫయాజ్,కదిరి రమణయ్య,రహిమాన్,ముత్యాల ప్రతాప్, సాయి, తదితరులు ఉన్నారు.



## చంద్రబాబు పాలన అవనీతమయం మండల వైఎస్ఆర్సీపి కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జున్రెడ్డి



**పొన్నలూరు పెన్ పవర్ మే 9**

రెండేళ్లు చంద్రబాబు పాలనంత అవినీతి అక్రమాల మయమైందని వైఎస్ఆర్సీపి మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జున్రెడ్డి శనివారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అన్నారు. రైతులను పట్టించుకోవడంలేదని తెలిపారు వైసిపి ప్రభుత్వంలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించారని. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. గతంలో ఉన్న రేట్లు ఇప్పుడు లేవని ఆయన తెలిపారు. జడ్పిటిసి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందాయని, చంద్రబాబు నాయుడు ఎలక్షన్లకు ముందు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తానని ప్రభుత్వం వచ్చాక కల్లబొల్లి మాటలు చెప్పి కాలయాపన చేస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి రైతులందరికీ రైతు భరోసా ప్రతి ఒక్క రైతుకు ఖాతాలో జమ చేశారని కూటమి ప్రభుత్వం వచ్చాక పేరు మార్చి అన్నదాత సుఖీభవ రైతులకు కొంతమందికి జమ చేసి కొంతమందికి చేయకుండా నిలిపివేశారని ఈ సందర్భంగా తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి కాలనీలు మంజూరు చేస్తే చంద్రబాబు నాయుడు ప్రజలకు మాయమాటలు మూడు సెంట్లు కాలనీ ఏర్పాటు చేస్తారని రెండు సంవత్సరాలు అయినా ఇప్పటివరకు ఆ ఊసే లేదని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి సంక్షేమ కేలండర్ పెట్టి ఈ నెలలో ఈ సంక్షేమ పథకం ఇస్తామని చెప్పి అమలు చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పూర్తిగా గాలికి వదిలేసి అభివృద్ధి లేదు సంక్షేమం లేదు అని అన్నారు. పొన్నలూరులో గత ప్రభుత్వం రోడ్లు 70% పూర్తి చేసేమని తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధి లేకుండా ఇసుక మట్టి రేషన్ మాఫియా జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. గ్రామాల్లో మంచినీటి కంటే మద్యం ఎక్కువగా దొరుకుతుందని ప్రతి ఊరికి ఒక బెల్ట్ షాపు ఓపెన్ చేసి మద్యం అమ్ముతున్నారని అన్నారు. రెండేళ్లలోని కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడిందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు తప్పక బుద్ధి చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో సిరిగిరి గోపాల్ రెడ్డి, కాటా మాధవరావు, పల్నాటి వెంకటేశ్వర్ రెడ్డి, అనుమోలు ప్రసాద్, జ్యేష్ట వేణు, కంచర్ల రాము, దేవరపల్లి యశ్వంత్ రెడ్డి, పచ్చవ వంశీ, గడ్డం ప్రసాద్, వెన్నపూస మాల్యాద్రి, మన్యం రమణయ్య, సిరిగిరి బాల్రెడ్డి, ఇండ్ల శీను, కల్లూరి మాలకొండయ్య, సాయిరాం, సిరిగిరి రామకృష్ణారెడ్డి, మూలే వినోద్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు సి ఎస్ పురంలో ఉచిత మెడికల్ క్యాంప్ -డాక్టర్ పి. మల్లికార్జునరెడ్డి

**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 9**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం ఆర్టీసీ బస్టాండ్ ప్రక్కన నేడు ఉచిత మెడికల్ క్యాంప్ ను రమణమ్మ మెడికల్ మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు మల్లికార్జున రెడ్డి స్పెషాలిటీ హాస్పిటల్ ఎముకల, కీళ్ల వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ పి మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ముఖ్య అతిథిగా పి వి ఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ జనరల్ ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ పి ప్రతాపరెడ్డి హాజరై వైద్య సేవలు అందించి ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి తగిన వైద్య సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ ఉచిత మెడికల్ క్యాంపులో ఉచిత ఓపీ సేవలు, ఉచిత మందుల పంపిణీ, ఉచిత బీపీ చెకప్, ఉచిత రక్త పరీక్షలు, ఉచిత ఈసీజీ పరీక్షలు, ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు అలాగే ఎముకలు, కీళ్లు, నరాల సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించుకోవచ్చని తెలిపారు.ఈ మెడికల్ క్యాంప్ కు మండల ప్రజలు పాల్గొని ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## కిషోర వికాసం పై వేసవి శిక్షణ కార్యక్రమాలు



**పొన్నలూరు పెన్ పవర్ మే 9**

స్థానిక వెలుగు కార్యాలయంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రిజ్వాన ఆధ్వర్యంలో శనివారం కిశోర వికాసం వేసవి సెలవులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఎస్సై పి సత్యనారాయణ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మొబైల్ ద్వారానే 80% సైబర్ నేరాలు జరుగుతున్నాయని, పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని అంగన్వాడీ కార్యకర్తలకు ఆశ వర్కర్లకు అవగాహన పెంచుకొని ఇటువంటి మోసాలకు గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లలను చుట్టుపక్కల వదిలిపెట్టకుండా మనమే శ్రద్ధ తీసుకొని పెంచాలని సూచించారు. బాల్యవాహాలు గృహహింస వరకట్న దాడులు ఆమ్ల దాడులు పిల్లల అక్రమ రవాణా పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సతీష్ బాబు, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, పశు వైద్యాధికారి శివరామకృష్ణ, ఎంఈఓ2 సుబ్బరామయ్య, వీఆర్వోలు, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభ విద్యార్థులను అభినఅందనలు

### బిజెపి నాయకులుఅప్పిశెట్టి ఉదయ్ శంకర్



**గిద్దలూరు పెన్ పవర్ మే 9**

గిద్దలూరు పట్టణము లో బీజేపీ నాయకులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యం లో ప్రకాశము జిల్లా మాజీ జిల్లా ఉపాధ్యక్షులు భవనాషి వెంకట రామాంజనేయులు ద్వితీయ కుమార్తె ఇంటర్ ద్వితీయ ఇంటర్ చదువుతూ 1000 మార్కులకు 989 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో థర్డ్ ర్యాంక్ సాధించడం తెలుసుకొని గిద్దలూరులో వారి నివాసము కు వెళ్ళి శాలువ తో సన్మానించి భవిష్యత్తులో అత్యుత్తమ మార్కులు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, సమాజానికి ఎంతో సేవ అందించేలా తల్లి తండ్రు లకు సమాజానికి పేరుతీసుకు రావాలని బీజేపీ నాయకులు తో కలిసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దప్పిలి వినోద్ కుమార్ రెడ్డి,కొప్పరపు వెంకటేశ్వర్లు, టి పీరయ్య ,ముప్పూరి శ్రీనివాసులు, వేమూరి శ్రీనివాసులు, గర్రె శ్రీధర్ ,నూకల శ్రీనివాసులు పాల్గొన్నారు.

## వీరపనేని వారి పెళ్లి వేడుకలు టిడిపి నాయకులు



**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 9**

మండలంలోని మైలుచర్ల గ్రామంలో శనివారం జరిగిన వీరపునేని వారి వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి ఈ వివాహ వేడుకలకు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొబ్బూరి రమేష్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ తోడేటి అల్లూరయ్య, సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ బోయళ్ళ నారాయణరెడ్డి, మాజీ మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు టిడిపి సీనియర్ నాయకులు నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, బొబ్బూరి మణి, దొర తిరుపతయ్య, జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ డైరెక్టర్ కోనంకి వెంకట కొండయ్య, రామకృష్ణరాజు చావా సుబ్బయ్య రష్యా యాదవ్ , ప్రసాద్ , పాములపాటి నరసయ్య పోకల మాలాద్రి , షేక్ రజ్జబ్ భాషా , బత్తుల వెంకటాద్రి, రేనాటి వెంకటేశ్వర్లు, జర్నలిస్టు ఎస్పీ నాయుడు, దాసరి మల్లికార్జున, సంగిశెట్టి రమేష్ , తిరుపతయ్య, రంగస్వామి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శు భాకాంక్షలు తెలిపారు.

## జరుగుమల్లి కాపు జె ఎ సి అధ్యక్షుడుగా పల్లా శ్రీనివాస్ నాయుడు.

**జరుగుమల్లి, మే 9, పెన్ పవర్**



కాపులు కాపు ఉపకులాల హక్కుల సాధన, ఐక్యత, ఉమ్మడి పోరాటాలు సంక్షేమానికి కొండపి నియోజకవర్గం జరుగుమల్లి కేంద్రంగా సేవలు అందించేందుకు ఎపి కాపు బలిజ ఉపకులాల జె ఎ సి పని చేస్తుందని జరుగుమల్లి కాపు బలిజ ఉపకులాల జె ఎ సి అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ నాయుడు మీడియా కి తెలిపారు. ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ కాపు బలిజ ఉపకులాల జె ఎ సి రాష్ట్ర చైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడు నియామకం ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర నాయకత్వం తన పై పెట్టిన బాధ్యతను అంకిత భావంతో నిర్వహిస్తానని మండలం లో ఉన్న కాపు బలిజ ఉపకులాల ప్రజలు నాయకులు తనకు సహకరించాలని ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపు ఇచ్చారు.

# గంటకు 154 కి.మీ వేగం... ఐపీఎల్‌ను షేక్ చేస్తున్న యువ పేసర్ ఇతడే!

**ఐపీఎల్ 2026లో సంచలనంగా మారిన గుజరాత్ పేసర్ అశోక్ శర్మ**

**గంటకు 150 కి.మీ పైగా వేగంతో నిలకడగా బౌలింగ్**

**రాజస్థాన్‌పై 154.2 కి.మీ వేగంతో ఈ సీజన్‌లో ఫాస్టెస్ట్ బాల్ నమోదు**

**బ్రెట్ లీ, డేల్ స్టెయిన్‌ల నుంచి స్ఫూర్తి పొందినట్లు వెల్లడి**

**కోచ్ ఆశిష్ నెహ్రా మార్గదర్శకత్వంలో రాటుదేలుతున్న యువ బౌలర్**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ మరో భారత యువ పేస్ బౌలర్‌ను వెలుగులోకి తెచ్చింది. గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడుతున్న 23 ఏళ్ల అశోక్ శర్మ, తన అసాధారణ వేగంతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. నిలకడగా గంటకు 150 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు సంధిస్తూ, ఈ టోర్నమెంట్‌లో సరికొత్త సంచలనంగా మారాడు. అతని బౌలింగ్‌లో కేవలం వేగమే కాదు, ప్రత్యర్థి బ్యాటర్లను భయపెట్టే నిర్భయమైన తత్వం కూడా కనిపిస్తోంది.

ఇటీవల రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అశోక్ శర్మ తన సత్తా ఏంటో పూర్తిస్థాయిలో చూపించాడు. ఆ జట్టు బ్యాటర్ ధ్రువ్ జురెల్‌కు సంధించిన ఓ బంతి ఏకంగా 154.2 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లింది. ఇది ఈ ఐపీఎల్ సీజన్‌లో నమోదైన అత్యంత వేగవంతమైన బంతి మాత్రమే కాదు, ఐపీఎల్ చరిత్రలోనే వేగవంతమైన బంతుల్లో ఒకటిగా నిలిచింది. ఈ ప్రదర్శనతో అతను ఒక్కసారిగా వార్తల్లో నిలిచాడు.

### చిన్ననాటి కల నిజమైంది

చిన్నప్పుడు ఆస్ట్రేలియా దిగ్గజం బ్రెట్ లీ, దక్షిణాఫ్రికా స్టార్ డేల్ స్టెయిన్‌ల బౌలింగ్‌ను చూసి తాను కూడా వారిలాగే 150 కి.మీ. వేగంతో బంతులు వేయాలని కలలు కన్నట్లు అశోక్ శర్మ తెలిపాడు. "ఒక ఫాస్ట్ బౌలర్ కెరీర్‌లో 150 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేయడం చాలా పెద్ద విషయం. ఆ మార్క్‌ను అందుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ఇప్పుడు ఆ అనుభూతిని నేను పొందుతున్నాను. నా చిన్ననాటి కల నెరవేరింది. అయితే, నా వ్యక్తిగత మైలురాళ్ల కంటే జట్టును గెలిపించడమే ప్రస్తుతం నా ముందున్న లక్ష్యం" అని అశోక్ వివరించాడు.

### నెహ్రా మార్గదర్శకత్వం

తన ప్రదర్శన వెనుక గుజరాత్ టైటాన్స్ హెడ్ కోచ్ ఆశిష్ నెహ్రా పాత్ర ఎంతో ఉందని అశోక్ శర్మ కృతజ్ఞతగా చెప్పాడు. నెహ్రా మార్గదర్శకత్వంలో తన బౌలింగ్‌లో క్రమశిక్షణ, మ్యాచ్ పరిస్థితులను అర్థం చేసుకునే నైపుణ్యం మెరుగుపడిందని తెలిపాడు. "ఫాస్ట్ బౌలర్‌గా రాణించాలంటే ముందుగా టెస్ట్ మ్యాచ్ లెంగ్త్‌పై పట్టు సాధించాలని, ఆ లెంగ్త్‌లో ఆరు బంతుల్నీ ఒకేచోట వేసే నియంత్రణ వచ్చాకే యార్కర్లు, స్లోవర్ బంతుల వంటి ఇతర అస్త్రాలను ప్రాక్టీస్ చేయాలని నెహ్రా చెప్పిన సూచన నాకెంతో ఉపయోగపడింది" అని అశోక్ వెల్లడించాడు.

### కఠినమైన ప్రయాణం... దక్కిన గుర్తింపు

రాజస్థాన్‌కు చెందిన అశోక్ శర్మను ఐపీఎల్ 2026 వేలంలో గుజరాత్ టైటాన్స్ రూ. 90 లక్షలకు కొనుగోలు చేసింది. గతంలో కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లలో సభ్యుడిగా ఉన్నప్పటికీ, ఒక్క మ్యాచ్ ఆడే అవకాశం కూడా రాలేదు. అయితే, పట్టువదలకుండా దేశవాళీ క్రికెట్‌లో రాణించి, 2025-26 సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 22 వికెట్లతో సత్తా చాటాడు. ఈ ప్రదర్శనే అతనికి ఐపీఎల్‌లో అసలైన అవకాశం కల్పించింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆరు మ్యాచ్‌లు ఆడి 6 వికెట్లు పడగొట్టాడు. లక్నో సూపర్ జెయింట్స్‌పై 32 పరుగులకు 2 వికెట్లు తీయడం అతని అత్యుత్తమ ప్రదర్శన. అపారమైన వేగం, సరైన మార్గదర్శకత్వం తోడవడంతో అశోక్ శర్మ భారత క్రికెట్ భవిష్యత్ ఆశాకిరణంగా కనిపిస్తున్నాడు.

# ప్లే ఆఫ్ క్లాష్.. గెలిచేదెవరు..?

## పింక్ ప్రామిస్ మ్యాచ్‌లో రాజస్థాన్ కొట్టే సిక్సులెన్ని..?









**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 లో భాగంగా మే 09 (శనివారం) రాజస్థాన్ వర్సెస్ గుజరాత్ మ్యాచ్ రసవత్తరంగా ఉండనుంది. వరుసగామూడు గెలుపులతో కాన్ఫిడెన్స్ తో దండయాత్రకు బయల్దేరింది గుజరాత్ టీమ్. అదే క్రమంలో గత ఓటములనుంచి కోలుకుని.. టాప్ 4 స్థానాన్ని పదిలం చేసుకునేందుకు సిద్ధమైంది గుజరాత్. దీంతో రెండు టీమ్స్ మధ్య వార్ గట్టిగానే నడిచేలా ఉంది. మరో విషయం ఏంటంటే.. రాజస్థాన్ రాయల్స్ కు ఇది పింక్ ప్రామిస్ మ్యాచ్. అంటే పూర్తి పింక్ కలర్ జెర్సీలతో సందడి చేయనున్నారు. ఈ థీమ్ ఉద్దేశం ఏంటంటే.. ఎన్ని సిక్సులు కొడితే అన్ని.. ఆరు రెట్లు ఇండ్లకు సోలార్ లైటింగ్ సదుపాయం కల్పించడం. అంటే ఒక్క సిక్సుకు ఆరు ఇండ్లకు సోలార్ పవర్ సౌకర్యం కల్పించనున్నారు. దీంతో రాత్రికి కొట్టే సిక్సులపై కౌంటింగ్ మామూలుగా ఉండదు.పింక్ ప్రామిస్ మ్యాచ్ ఇది మూడో ఏడు. 2026లో 260 ఇళ్లు సోలార్ తో వెలిగాయి. 2025లో సాంబార్ ప్రాంతంలోని 520 ఇండ్లకు సౌర విద్యుత్ వెలుగులు అందించారు. ఈ ఏడు అంతకు మించిన సిక్సులు పడతాయని ఊహిస్తున్నారు ఫ్యాన్స్.రాజస్థాన్ లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్ ను దెబ్బకొట్టి తమ టాప్-ఫోర్ స్థానాన్ని కాపాడుకోవాలని రాజస్థాన్ రాయల్స్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ 52వ మ్యాచ్‌కు ఇరు జట్లు 12 పాయింట్లతో సమంగా ఉన్నాయి. దీంతో ప్లేఆఫ్ అర్హత కోసం ఈ పోరు రసవత్తరంగా ఉండనుంది. రాజస్థాన్ ఇటీవల ఢిల్లీ చేతిలో ఓటమి చవిచూడగా, గుజరాత్.. వరుసగా మూడు మ్యాచ్‌ల విజయ పరంపరతో జైపూర్‌కు వస్తోంది. లాస్ట్ మ్యాచ్‌లో 90 రన్స్ తో వీరోచిత ఇన్నింగ్స్ ఆడిన కెప్టెన్ రియాన్ పరాగ్ ఫామ్ లోకి రావటం ఆర్ఆర్ కు కలిసొచ్చే అంశం. జాసన్ హోల్డర్ నేతృత్వంలోని గుజరాత్ బౌలింగ్ .. మహమ్మద్ సిరాజ్ స్పీడ్ ముందు పరాగ్ నాయకత్వానికి గట్టి పరీక్ష ఎదురుకానుంది. పవర్‌ప్లే ఓవర్లలో వేగంగా పరుగులు పిండుకోవడానికి రాయల్స్ తమ యువ ఓపెనింగ్ జోడి యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీలపై ఎక్కువగా ఆధారపడనుంది.

## ఏఎఫ్‌సీ అండర్--17 విమెన్స్ ఆసియా కప్.. చరిత్ర సృష్టించిన ఇండియా ఫుట్ బాల్ జటు



**హైదరాబాద్ పెన్ పవర్:** సుజౌ (చైనా): ఏఎఫ్‌సీ అండర్--17 విమెన్స్ ఆసియా కప్‌లో ఇండియా ఫుట్‌బాల్ జట్టు చరిత్ర సృష్టించింది. గ్రూప్--బిలో భాగంగా శుక్రవారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఇండియా 4--0తో లెబనాన్‌పై గెలిచింది. ఫలితంగా గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారి క్వార్టర్‌ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. గ్రూప్--సిలో ఫిలిప్పీన్స్, చైనీస్‌తైపీ మధ్య జరిగిన మ్యాచ్ ఫలితం ఇండియాకు అనుకూలంగా రావడంతో నాకౌట్ బెర్త్ ఖాయమైంది. ఈ మ్యాచ్‌లో ఫిలిప్పీన్స్, చైనీస్‌తైపీలో ఏదో ఓ జట్టు ముందుకెళ్లాలంటే కనీసం 12 గోల్స్ చేయాల్సి ఉంది. కానీ రెండు జట్లూ టార్గెట్‌ను చేరుకోలేకపోయాయి.2005 తర్వాత ఈ టోర్నీలో ఇండియాకు ఇదే తొలి విజయం కావడం విశేషం. ఇక లెబనాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇండియా తరఫున ప్రీతిక బర్మన్ (7, 85వ ని), అల్వా దేవి సెంజమ్ (36వ ని), జోయా (72వ ని) గోల్స్ చేశారు. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన ఇండియన్ స్ట్రయికర్లు లెబనాన్‌కు పుంజుకునే అవకాశం ఇవ్వలేదు. ఏడో నిమిషంలోనే ప్రీతిక కొట్టిన లెఫ్ట్ ఫుట్ కిక్ గోల్‌తో ఇండియా ఆధిక్యంలోకి వచ్చేసింది. తొలి హాఫ్‌లో 2--0 లీడ్‌లో నిలిచిన ఇండియా రెండో అర్ధభాగంలో మరో రెండు గోల్స్ చేసింది. ఈ టోర్నీలో ఇండియా సెమీస్‌కు చేరుకుంటుంటే 2026 ఫిఫా అండర్--17 వరల్డ్ కప్‌కు డైరెక్ట్‌గా అర్హత సాధిస్తుంది.

# రెడ్ బికినీలో బొమ్ డిగి డిగి బ్యూటీ హొయలు



**సీరత్ కపూర్ సిల్క్ చీరలో టైమ్‌లెస్ గాంభీర్యంతో స్టన్ చేసింది**



నేటి తరంలో అత్యంత వేగంగా గుర్తింపు తెచ్చుకున్న ముంబై భామల్లో సాక్షి మాలిక్ ఒకరు. కెరీర్‌ను ఒక మోడల్‌గా ప్రారంభించి.. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా అనతి కాలంలోనే విపరీతమైన ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. ముఖ్యంగా బాలీవుడ్ చిత్రం -సోను కే టిటు కి స్వీటీ-లోని -బొమ్ డిగి డిగి- పాటలో కేవలం కొన్ని సెకన్ల పాటు కనిపించినా...తన అందం ఎనర్జీతో ప్రేక్షకులను కట్టిపడేసింది. ఆ ఒక్క పాటతో సాక్షి ఓవర్‌నైట్ స్టార్‌గా మారిపోయింది. ఢిల్లీకి చెందిన ఈ భామ వృత్తిరీత్యా ఇంజనీరింగ్ చదివినా గ్లామర్ రంగంపై ఉన్న మక్కువతో ముంబైకి చేరుకుని తన కలలను సాకారం చేసుకుంటోంది.

తాజాగా సాక్షి మాలిక్ షేర్ చేసిన రెడ్ హాలిట్ ఫోటోషూట్ నెట్టింట మంటలు రేపుతోంది. మునుపెన్నడూ లేనంత గ్లామరస్‌గా ఈ భామ ఒక ఎర్రటి డ్రెస్ లో మెరిసిపోయింది. ఈ రెడ్ హాట్ ఫ్రాకులో సాక్షి ఒలికించిన హొయలు యువత మతులు చెడగొడుతున్నాయి. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉంటూ తన అభిమానులకు టచ్‌లో ఉండే ఈ బ్యూటీ ఈ లేటెస్ట్ గ్లామర్ పిక్స్‌తో ఇంటర్నెట్‌లో మరోసారి వైరల్ అయ్యింది. సాక్షి ఫిట్‌నెస్.. స్టైలిష్ లుక్‌ను చూసి నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

అయితే సాక్షి మాలిక్ నటనా కెరీర్ ఆశించిన స్థాయిలో పుంజుకోకపోవడం వెనుక కొన్ని ఆసక్తికరమైన కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా సౌత్ సినిమాల్లో మాలిక్ కు చేదు అనుభవం ఎదురైంది. టాలీవుడ్‌లో నాని నటించిన ఎ చిత్రం విడుదలైప్పుడు.. సాక్షికి తెలియకుండానే తన ఫోటోను సినిమాలో అభ్యంతరకర రీతిలో వాడటం పెద్ద వివాదానికి దారితీసింది. దీనిపై చట్టపరమైన పోరాటం చేసి గెలిచినా ఆ అనూహ్య పరిస్థితుల వల్ల సాక్షి టాలీవుడ్ ప్రాజెక్టులకు దూరంగా ఉండాల్సి వచ్చింది. సరైన కథలు తన పాత్రకు ప్రాధాన్యత ఉన్న సినిమాల కోసం వేచి చూడటం వల్ల సాక్షి సౌత్ కెరీర్ ప్రస్తుతం కొంత నెమ్మదిగా సాగుతోంది.

డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ విషయానికి వస్తే... సాక్షి మాలిక్ వెబ్ సిరీస్‌లపై కూడా దృష్టి పెడుతోంది. ఇప్పటికే కొన్ని ప్రైవేట్ మ్యూజిక్ ఆల్బమ్స్.. యాడ్ ఫిలిమ్స్‌లో మెరిసిన ఈ భామ తదుపరి ఏవైనా భారీ వెబ్ సిరీస్‌లలో నటించబోతోందా అనే విషయంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం తన నటనలోని నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుంటూ ఓటిటి వేదికలపైకి రావడానికి ఆసక్తి చూపుతోంది. గ్లామర్ ఇమేజ్ నుండి బయటకు వచ్చి నటిగా నిరూపించుకునే అవకాశం ఉన్న సిరీస్‌ల కోసం సాక్షి చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. సాక్షి మాలిక్ 2026 కెరీర్ ప్లాన్స్ గురించి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు అందుతున్న సమాచారం ప్రకారం.. 2026లో కొన్ని కొత్త సినిమాల ఆడిషన్లలో పాల్గొంటోంది. పెద్ద బ్యానర్లలో అవకాశాల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. కేవలం సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గానే కాకుండా... వెండితెరపై ఒక పూర్తిస్థాయి నటిగా తనదైన ముద్ర వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2026లో సాక్షికి సంబంధించి కొన్ని క్రేజీ ప్రాజెక్టుల వివరాలు అధికారికంగా వెల్లడయ్యే అవకాశం ఉంది. ఈ లోపు తన గ్లామర్ ఫోటోషూట్లతో ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది ఈ బొమ్ డిగి డిగి బ్యూటీ.



**సాక్షి మాలిక్ అద్భుతమైన గ్లామరస్ లుక్‌లో తలదాచుకుంది**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com